

# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 03, సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## తెలంగాణ విమానాశ్రయాలను త్వరగా పూర్తి చేయండి



# ఎటు చూసినా విధ్వంసం, వికృతం



- కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం
- జలద్రోహం చేస్తున్న జలగల పాలన
- అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో
- భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమిషన్లు
- వెయ్యిరోజుల్లో 4.50లక్షల కోట్ల అప్పులు
- రుణమాఫీ, పెన్షన్లు, ఉద్యోగాలు అన్నీ మోసపూరిత హామీలే
- కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల పాలనపై బిఆర్ఎస్ ఛార్జ్‌షీట్
- సిఎం రేవంత్ పాలనపై నిప్పులు కక్కిన కెటిఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 02:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. బుధవారం రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల దగా పాలనపై హరీశ్ రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో షార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన కాదు.. ఇది పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమిషన్లు తీసుకుంటున్నారు. అభివృద్ధి పనులు చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం 4.50లక్షల కోట్ల అప్పులు చేసింది. కాంగ్రెస్ అసమర్థత ప్రొ మ్యాక్స్, అవినీతి అల్ట్రామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స్ అంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారుచేసింది. రూ.50వేల కోట్లు రుణమాఫీ చేస్తామని.. రూ.20వేల కోట్లు చేశారు. రుణమాఫీ చేస్తామని.. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టారు. మాఫీ చేయకుండానే.. 70శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే.. కాంగ్రెస్ నాశనం చేసింది. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం. కాళేశ్వరం మీద కక్షకట్టి.. రైతులను శిక్షిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు. కానీ, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ పేరిట.. జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. ఢిల్లీలో రాహుల్ జెన్ జీని వెంటపెట్టుకొని.. ప్రజాస్వామ్యమని కొటేషన్లు చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు,

మిగతా 3లో..

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు



- మరింత ముదురుతున్న యుద్ధ వాతావరణం
- అమెరికా, ఇరాన్‌ల మధ్య పరస్పర దాడులు
- పెళ్లి వేడుకపై అమెరికా క్షిపణి దాడి
- ఐదుగురు మృతి, 50 మందికి గాయాలు
- ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్ సైన్యం
- ప్రతీకారం తీర్చుకుంటాం..
- అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్!

వివరాలు 2లో..

## నాపై చర్యలు తీసుకునే ముందు రేవంత్ సంగతి చూడండి



- పదేళ్ళు నేనే ముఖ్యమంత్రి అని ఎలా అంటారు
- రెడ్లకో న్యాయం..బిసిలకో న్యాయమా
- ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలతో కొండా సురేఖ భేటీ
- మీడియా ముందు సంచల వ్యాఖ్యలు

వివరాలు 3లో..

## ఇన్వెస్ట్ తెలంగాణలో రక్షణ
# ఎక్స్‌పో ప్రారంభించండి

- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం రేవంత్ వినతి





**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలం గాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరు కావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో - 2026ను ప్రారం భించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రక్షణ శాఖ మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వీరు చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్ షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించ నున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రక్షణ

మిగతా 3లో..

## తెలంగాణ చరిత్రను తుడిచేస్తున్నారు..

- కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్‌పై బీజేపీ ఫైర్..!
- సెప్టెంబర్ 17ను పాఠ్యపుస్తకాల్లో చేర్చుతాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 02:** కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ మూడు పార్టీలు కలిసి హైదరాబాద్, తెలంగాణ అస్తిత్వాన్ని, నిజాం వ్యతిరేక పోరాట చరిత్రను తుడిచివేసే ప్రయత్నం చేస్తున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపిం చారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా పరకాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఉన్నంతకాలం తెలంగాణ ప్రజలకు పోరాట చరిత్రను వివరిస్తూనే ఉంటామని.. తాము అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17 గొప్పతనాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చుతామని ప్రకటించారు. హనుమకొండ జిల్లా పరకాలలో తెలంగాణ విమోచన దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించా రు. అనంతరం పరకాలలోని అమరధామం వద్ద రామచందర్ రావు అమరవీరులకు నివాళు లర్పించారు.

మిగతా 3లో..

## అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది

- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న హామీని నెరవేర్చాం
- సింహాచలం, అరసవల్లికి నీటిని తరలిస్తాం
- ఉత్తరాంధ్రను ఉన్నతాంధ్రగా మార్చడమే లక్ష్యం
- అనకాపల్లిబహిరంగ సభలో సిఎం చంద్రబాబు

వివరాలు 5లో..



## పాత, కొత్త డేటా సిరీస్‌లను పోల్చడం సరికాదు

- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 02:** భారతదేశం సాధించిన 7.8 శాతం జీడీపీ వృద్ధి రేటుపై వస్తున్న విమర్శలను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేతలు, మాజీ ఉన్నతాధికారులను లక్ష్యం చేసుకుంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. గణాంకాల వాస్తవికతను ప్రశ్నించేవారికి సరైన ఉపాధి లేదని, అందుకే వారు టీవీ చర్చా వేదికలపై కూర్చుని కల్పిత వాదనలను తెరపైకి తెస్తున్నారని

మిగతా 3లో..

## అంతుచిక్కని ప్రకృతి విలయం



- 1127కి చేరిన వరద మృతుల సంఖ్య
- 4858 మంది కోసం ఇంకా గాలింపు
- డీఎన్ఏ టెస్టుల ద్వారా శవాల గుర్తింపు

వివరాలు 2లో..

## మరో పదిమంది నకిలీ వైద్యుల పట్టివేత




**వివిధ ప్రాంతాల్లో దాడి చేసి పట్టుకున్న పోలీసులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 02:** అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరి కొందరు నకిలీ డాక్టర్లను పట్టుకున్నారు. అర్హత లేకపోయినా డాక్టర్ల అవతారమెత్తి క్లినిక్‌లు నడుపుతున్న 10 మంది ఫేక్ డాక్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఈ మెరుపు దాడుల వివరాలను కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటి రెడ్డి వెల్లడించారు. మేడ్చల్ - మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల్లో నకిలీ క్లినిక్‌ల దందా విచ్చల విడిగా సాగుతోందన్న పక్కా సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. పేట్ బషీరాబాద్, మేడ్చల్, జగద్గిరిగుట్ట,

3లో..

## కూకట్‌పల్లిలో భూముల
# ధరలకు రెక్కలు

**గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు విక్రయం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 02:** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో హౌసింగ్ బోర్డు భూములకు భారీ డిమాండ్ వచ్చింది. కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో 16 ఎంఐజీ ఓపెన్ ప్లాట్లు రికార్డు ధరలకు అమ్ముడయ్యాయి. ఈ వేలంలో గజం భూమి గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు విక్రయించడం హాట్‌టాపిక్‌గా మారింది. హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో భూముల ధరలు ఏ స్థాయిలో ఉన్నాయో ఈ వేలం మరోసారి స్పష్టం చేసింది. అధికారులు నిర్వహించిన ఈ బహిరంగ వేలంలో ఒక్కో గజానికి కనీస ధరను రూ.1.60 లక్షలుగా నిర్ణయించగా, వేలంలో పలువురు బిడ్డర్లు పోటీ పడటంతో ధరలు గణనీయంగా పెరిగాయి. అత్యధికంగా ఒక ఎలాట్ గజం రూ.2.70 లక్షలకు అమ్ముడైంది. మరో ఎలాట్ గజం రూ.2.36 లక్షలకు విక్రయించారు. అదేవిధంగా మరో రెండు ప్లాట్లు గజం రూ.2.06 లక్షల చొప్పున అమ్ముడయ్యాయి.

మిగతా 3లో..

## కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశాం

- రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఉన్న అభివృద్ధి వైపుకు
- అప్పుల భారం ఉన్నప్పటికీ ముందుకు వెళుతున్నాం
- వెయ్యి రోజుల పాలన

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



# ఉబర్‌లో 3,300 మంది ఉద్యోగుల తొలగింపు

- కంపెనీ పునర్‌వ్యవస్థీకరణే కారణమన్న సీఈవో
- 30 వేలకు పడిపోనున్న ఉద్యోగుల సంఖ్య




**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 :** ప్రముఖ అంతర్జాతీయ క్యాబ్ సేవల దిగ్గజం 'ఉబర్ టెక్నాలజీస్' తన ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చింది. సంస్థ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 3,300 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10 శాతానికి సమానం. ఈ మేరకు సంస్థ సీఈవో దారా ఖోస్రోషాహి ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా అధికారిక సమాచారం అందించారు. సంస్థలో నిర్వహణ స్థాయిలను తగ్గించి, పనితీరును మరింత మెరుగుపరిచేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సీఈవో వెల్లడించారు. ఇటీవలి కాలంలో అనవసరమైన విభాగాలు, అదనపు మేనేజ్‌మెంట్ స్థాయిలు పెరిగాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వాటి అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. రైడ్ షేరింగ్, డెలివరీ, రోబోట్యాక్సీ వంటి కీలక వ్యాపార విభాగాల్లో పెట్టుబడులను సమీక్షించనున్నట్లు వివరించారు. ఈ లేఆఫ్‌ల ప్రభావం 20 శాతం మంది మేనేజర్లతో పాటు, ఇతర స్థాయిల సిబ్బందిపై కూడా ఉంటుందని కంపెనీ పేర్కొంది. ఉద్యోగుల తొలగింపుతో పాటు, ఉబర్ తన రిమోట్ వర్క్ విధానానికి దాదాపు స్వస్తి పలికింది. భవిష్యత్తులో కేవలం ఒక శాతం మంది ఉద్యోగులకు మాత్రమే ఇంటి నుండి పనిచేసే అనుమతి ఉంటుందని, మిగిలిన వారంతా తప్పనిసరిగా కార్యాలయాల నుంచే విధులు నిర్వహించాలని ఆదేశించింది. ఈ లేఆఫ్‌ల అనంతరం ఉబర్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 30 వేలకు పరిమితం కానుంది. తద్వారా సంస్థ సిబ్బందిసంఖ్య తిరిగి 2021 నాటి స్థాయికి చేరుకోనుంది.

# 373 పాయింట్లు పతనమైన సెన్సెక్స్

## 141.35 పాయింట్లు తగ్గిన నిఫ్టీ



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 :** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, బాండ్ ఈల్డ్స్ ఎగబాకడంతో ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి. దీంతో ఇన్వెస్టర్లలో రిస్క్ తీసుకునే ఆసక్తి తగ్గింది. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 373.93 పాయింట్లు నష్టపోయి 76,570.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 141.35 పాయింట్లు తగ్గి 23,914.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 24,000 స్థాయి కంటే దిగువన ఉన్నంతకాలం మార్కెట్‌లో బేరిష్ (అమ్మకాల ఒత్తిడి) ధోరణి కొనసాగే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ధరలు పెరిగినప్పుడు షేర్లను విక్రయించే 'సెల్ ఆన్ రైజ్' వ్యూహం అనుకూలంగా ఉండొచ్చని పేర్కొన్నారు. నిఫ్టీ మరింత పడితే 23,700-23,730 స్థాయికి చేరే అవకాశం ఉందని ఓ విశ్లేషకుడు అంచనా వేశారు. క్రూడాయిల్ ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం మళ్లీ పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన మార్కెట్‌పై ప్రభావం చూపింది. కంపెనీల ఉత్పత్తి వ్యయాలు పెరిగే అవకాశాలు కూడా ఇన్వెస్టర్లను అప్రమత్తంగా మార్చాయి. మరోవైపు బాండ్ ఈల్డ్స్ పెరగడంతో ఈక్విటీలతో పోలిస్తే బాండ్లపై ఆసక్తి పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. నిఫ్టీలో ఐషర్ మోటార్స్, విప్రో ఇండియా, బజాజ్ ఆటో షేర్లు ఎక్కువగా నష్టపోయిన వాటిలో నిలిచాయి. ఆటో రంగం అత్యధికంగా దెబ్బతింది. నిఫ్టీ ఆటో సూచీ 2 శాతానికి పైగా పడిపోయింది. నిఫ్టీ ఐటీ, నిఫ్టీ మీడియా సూచీలు కూడా బలహీనంగా ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.53 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.33 శాతం నష్టపోయాయి. అయితే నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ మార్కెట్ ట్రెండ్‌కు భిన్నంగా మెరుగ్గా రాణించింది. అధిక చమురు ధరలు, పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్ వల్ల ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని ఇన్వెస్టర్లు అంచనా వేస్తున్నారని మార్కెట్ నిపుణులు తెలిపారు. దీంతో సమీప కాలంలో మార్కెట్‌లో అప్రమత్తమైన ధోరణి కొనసాగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ఆర్మీ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ

## రంగంలోకి దిగిన మిలిటరీ ఇంటిలిజెన్స్

**హైదరాబాద్, సెప్టెంబర్ 02:** సికింద్రాబాద్ బొల్లారం ప్రాంతంలోని 20 మద్రాస్ ఆర్మీ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఆర్మీ అంతర్గత విచారణతో పాటు హైదరాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. తాజాగా కేంద్ర మిలటరీ ఇంటెలిజెన్స్ కూడా రంగంలోకి దిగింది. ఆయుధాల చోరీ వెనుక బయటి వ్యక్తులతో పాటు లోపలి వ్యక్తుల ప్రమేయం ఉందా అనే కోణంలో విచారణ సాగుతోంది. ఆగస్టు 30 రాత్రి నుంచి 31వ తేదీ తెల్లవారుజాము మధ్య చోరీ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆర్మీలోని ఆయుధాల పెటటెల తాళాలు పగులగొట్టి ఒక ఇన్సాస్ రైఫిల్, నాలుగు ఏకే-47లు, ఆరు పిస్టళ్లు సహా మొత్తం 12 ఆయుధాలను అపహరించినట్లు సమాచారం. వీటితో పాటు 21 మ్యాగజైన్లు, 1,912 రౌండ్ల తూటాలు, నైట్ విజన్ బైనాక్యులర్ కూడా చోరీకి గురైనట్లు తెలుస్తోంది. కట్టుదిట్ట మైన భద్రత ఉండే సైనిక స్థావరంలోకి ప్రవేశించి ఆయుధాగారాన్ని గుర్తించడం, తాళాలు పగులగొట్టి ఇంత పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని తరలించడం సాధారణ దొంగలకు సాధ్యం కాదని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఇది 'ఇంటి దొంగల' పనే అయి ఉండొచ్చన్న కోణంలో మల్కాజిగిరి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సెక్యూరిటీ ఎ÷-లాన్, ఆయుధాల నిల్వ ప్రాంతాలపై అవగాహన ఉన్న వ్యక్తుల సహకారం ఉందా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. మిల్కా సింగ్ గ్రౌండ్ సమీపంలోని కెమెరాల్లో తెల్లవారుజామున 3.48 గంటలకు ఓ అనుమానాస్పద బైక్ కనిపించినట్లు సమాచారం. ఆ బైక్‌కు చోరీతో సంబంధం ఉందా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. డాగ్ స్క్వాడ్ ఆధారంగా ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రెజిమెంట్ ప్రహరీ సమీపంలో ఓ మ్యాగజైన్ కూడా లభించింది. ఇప్పటికే సుమారు 12 మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. సిబ్బంది ప్రమేయం, సంఘవిద్రోహ శక్తుల కుట్ర తదితర కోణాల్లోనూ దర్యాప్తు కొనసా గుతోంది. ఆయుధాల రికవరీతో పాటు భద్రతా వైఫల్యాలపై ఆర్మీ అధికారులు విచారణ జరుపుతున్నారు.

# ఆపత్కాలంలో వెన్నంటి నిలిచిన మిత్రదేశం

- భారత్‌కు నేపాల్ ప్రధాని బాలేన్ షా కృతజ్ఞతలు!

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 :** నేపాల్‌లో సంభవించిన భయంకర వరద విపత్తు సమయంలో తక్షణమే స్పందించి అండగా నిలిచినందుకు భారత ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి నేపాల్ ప్రధానమంత్రి బాలేన్ షా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నేపాల్ పార్లమెంట్‌లో ప్రసంగించిన ఆయన, ప్రకృతి ప్రకోపంతో దేశం అతలాకుతలమైన కష్టకాలంలో భారత్ నిజమైన ఆపద్బాంధవుడిలా ఆదుకుందని కొనియాడారు. సహాయక చర్యల కోసం ప్రత్యేక రెస్క్యూ బృందాలు, అత్యవసర ఔషధాలు, ఆహార సామగ్రిని సరిహద్దుల గుండా యుద్ధప్రాతిపదికన పంపి వేలాది మంది ప్రాణాలను కాపాడటంలో భారత్ కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. ఆపదలో నిస్వార్థంగా ఆదుకున్న భారతదేశాన్ని నేపాల్ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు. భవిష్యత్తులో భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు, వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని ప్రధాని బాలేన్ షా స్పష్టం చేశారు. నేపాల్ చరిత్రలోనే కనివినీ ఎరుగని రీతిలో వచ్చిన ఆకస్మిక వరదలు అపార ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. నదులు ఉప్పొంగి గ్రామాలు తుడిచిపెట్టుకుపోవడంతో సహాయక చర్యలు చేపట్టడం స్థానిక యంత్రాంగానికి పెను సవాలుగా మారింది. ఆ సమయంలో భారత జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు), భారత సైన్యానికి చెందిన ప్రత్యేక విమానాలు రంగంలోకి దిగాయి. మారుమూల ప్రాంతాల్లో చిక్కుకుపోయిన బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో భారత బలగాలు విశేష సేవలందించాయని నేపాల్ ప్రధాని సభలో వివరించారు. విపత్తుల నిర్వహణలో రెండు దేశాల పరస్పర సహకారం ఎంతో ప్రాముఖ్యమైనదని బాలేన్ షా ఉద్ఘాటించారు. హిమాలయ పర్వత ప్రాంతాల్లో వాతావరణ మార్పుల ముప్పును ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు సరిహద్దు దేశాల మధ్య నిరంతర సమన్వయం అవసరమని సూచించారు. నదుల నీటి ప్రవాహాల పర్యవేక్షణ, ఉపగ్రహ ఆధారిత ముందస్తు హెచ్చరికల వ్యవస్థల ఏర్పాటులో భారత సాంకేతిక నైపుణ్యం నేపాల్‌కు ఎంతగానో దోహదపడుతుందని ఆయన తెలిపారు. కేవలం సహాయక చర్యలకే కాకుండా, త్వరలో చేపట్టబోయే పునర్నిర్మాణ పనుల్లో కూడా భారత్ సహకారాన్ని కోరతామని నేపాల్ ప్రధాని పేర్కొన్నారు. వాణిజ్యం, కనెక్టివిటీ, సరిహద్దు మౌలిక సదుపాయాలు, జలవిద్యుత్ రంగాల్లో రెండు దేశాల మధ్య బంధాన్ని సరికొత్త స్థాయికి విస్తరించాలని పిలుపునిచ్చారు. ప్రాంతీయ శాంతి, ఇరు దేశాల ప్రజల శ్రేయస్సు కోసం ప్రధాని మోదీతో కలిసి పనిచేయడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని బాలేన్ షా పునరుద్ఘాటించారు.

# బావిలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు..

- తీవ్ర భయాందోళనకు గురైన ప్రయాణికులు




**హైదరాబాద్,సెప్టెంబర్2 :** కరీంనగర్ జిల్లాలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు ప్రయాణికులతో వెళ్తున్న బస్సు చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామ శివారులో అదుపుతప్పి వ్యవసాయ బావిపైకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఊహించని ఘటనతో పలువురు కేకలు వేయడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.సుందరగిరి శివారులోకి బస్సు చేరుకున్న సమయంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. బస్సు ముందు భాగంలోని టైర్ వ్యవసాయ బావిలోకి వెళ్లింది. దీంతో బస్సు మరింత ముందుకు వెళ్లకుండా ఆగిపోయింది. బావి వద్ద బస్సు ఆగిపోవడంతో అందులో ప్రయాణిస్తున్నవారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారకపోవడంతో ప్రయాణికులు చివరకు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనలో బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. ప్రమాదం జరిగిన వెంటనే ప్రయాణికులు బస్సు నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. స్థానికులు కూడా అక్కడికి చేరుకుని పరిస్థితిని గమనించారు. అదృష్టవశాత్తూ బస్సు పూర్తిగా బావిలోకి పడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కరీంనగర్ నుంచి హుస్నాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సాధారణంగా ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. బస్సు వ్యవసాయ బావి అంచుకు చేరుకోవడంతో ప్రయాణికుల్లో ఆందోళన మరింత పెరిగింది. ముందు టైర్ బావిలోకి వెళ్లడంతో ఏం జరుగుతుందోనని వారు భయపడిపోయారు. అయితే డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో బస్సు పూర్తిగా బావిలోకి జారిపోకుండా నిలిచిపోయిందని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో స్వల్ప గాయాలతో ప్రయాణికులు బయటపడటంతో కుటుంబ సభ్యులు కూడా ఊపిరిపీల్చుకున్నారు. ఘటనకు సంబంధించిన సమాచారం స్థానికంగా కలకలం రేపింది. రహదారిపై ప్రయాణించే వాహనాలు, ముఖ్యంగా ప్రయాణికులతో వెళ్లే బస్సులు ఇలాంటి ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది. వ్యవసాయ బావి సమీపంలో బస్సు ప్రమాదానికి గురైనప్పటికీ ప్రాణనష్టం లేకపోవడంతో స్థానికులు ఊరట చెందారు. కేవలం క్షణాల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయే అవకాశం ఉన్న ఈ ఘటనలో డ్రైవర్ సమయస్ఫూర్తి కారణంగానే భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

# ఆర్టీసీ నైట్ సర్వీసులు ప్రారంభం



**హైదరాబాద్,సెప్టెంబర్2 :** హైదరాబాద్ జంటనగరాల పరిధిలో నైట్ టైమ్ రవాణా సౌకర్యం కోసం ఇబ్బందులు పడుతున్న వారికి తెలంగాణ స్టేట్ రోడ్డు రవాణా సంస్థ శుభవార్త చెప్పింది. నైట్ డ్యూటీలు చేసే ప్రైవేట్ ఎంప్లాయిస్, ఐటీ కంపెనీల్లో నైట్ షిఫ్ట్‌లకు వెళ్లే టెక్కీలు, సివిల్ వర్క్స్ చేసుకునే వేలాది మంది ఇకపై ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టుతో కష్టాలు,డబ్బులు ఖర్చు చేసుకునే బాధను తగ్గించింది. ఇప్పటి వరకు పగటి పూట మాత్రమే ఆర్టీసీ బస్సులు నడిచేవి.. కాని ఇప్పుడు రాత్రి వేళల్లో కూడా ఆర్టీసీ బస్సులు నడుపుతోంది. నైట్ 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు నగరంలోని ప్రధానంగా 6 రూట్లలో ఈ సౌకర్యాన్ని కొనసాగిస్తోంది.హైదరాబాద్ ఐటీ కారిడార్‌తో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్సులు నడుపుతోంది తెలంగాణ స్టేట్ రోడ్డు రవాణా సంస్థ. ప్రయాణికులకు రవాణా కష్టాలు ఉండకూడదనే మంచి ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకుంది. మంగళవారం రాత్రి నుంచి ఈ సర్వీసులను కొనసాగిస్తోంది. మొత్తం 15 బస్సులతో ఈ సేవలను ప్రారంభించినట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీధర్ తెలిపారు. నగరంలోని ప్రధాన మార్గాలను, ఎక్కువ మంది ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే రూట్లను కలుపుతూ ఈ నైట్ సర్వీసులను నడుపుతున్నారు.
1. కోఠి నుంచి పటాన్‌చెరు ,అబిడ్స్, లక్డీకాపూల్, కొండాపూర్ వరకు రూట్ నంబర్ 222ఖా పేరుతో ప్రతి 45 నిమిషాలకు ఒక ట్రిప్ నడుపుతుంది. ఇక
2. రూట్ అఫ్జల్‌గంజ్ నుంచి జదీూ, పటాన్‌చెరు, కోఠి, ఖూఎదీ, మియాపూర్ మీదుగా 218 నంబర్‌తో బస్సులు అందుబాటులో ఉంటాయి. ఇక
3. సికింద్రాబాద్ నుంచి పటాన్‌చెరు , ప్యారడైజ్, కూకట్‌పల్లి, హైటెక్ సిటీ మీదుగా 219 నంబర్‌తో మరో సర్వీసు నైట్ టైమ్‌లో బస్సు సౌకర్యం ఉంది.
4. హైదరాబాద్ శివారు ప్రాంతంగా ఉన్న హయత్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వరకు ఎల్బీ నగర్, నాగోల్, తార్నాక కలుపుకుంటూ 290ఖ సర్వీసు ఏర్పాటు చేసింది. దీంతో పాటు బాచుపల్లి నుంచి వేవ్‌రాక్ ,ఐటీ క్యాంపస్‌ల మీదుగా 195ఔ నంబర్ తో ఓ సర్వీసు అందుబాటులో ఉంది. కొండాపూర్ నుంచి సికింద్రాబాద్ వరకు 10ఎ నంబర్ సర్వీసు నడుస్తోంది. ప్రస్తుతం నడుస్తున్న ఆరు రూట్లతో పాటు డిమాండ్‌ను బట్టి బస్సుల సంఖ్యను పెంచుతామని అధికారులు ప్రకటించారు. గతంలో 'నైట్ రైడర్స్' పేరుతో ఆర్టీసీ ఇలాంటి సర్వీసులను నడిపినప్పటికీ ప్రయాణించే వారి సంఖ్య తక్కువగా ఉండటంతో వాటిని ఆపేసింది. ఇప్పుడు సిటీలో నైట్ షిఫ్టుల్లో పనిచేసే ఉద్యోగులు, ముఖ్యంగా ఐటీ, హాస్పిటాలిటీ రంగాల సిబ్బంది, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సర్వీసులను మళ్లీ ప్రారంభించారు. ఈ నైట్ బస్సులు రాత్రి వేళల్లో ప్రయాణించే వారికి సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు అధికారులు. ఈ సర్వీసులకు సంబంధించిన మరింత సమాచారం కోసం 99592 26160 నంబర్‌లో సంప్రదించవచ్చని టీజీఎస్‌ఆర్టీసీ సూచించింది.

# అనంతపురంలో భారీ సౌర విద్యుత్ ప్రాజెక్ట్



- 400 మెగావాట్ల పవన-సౌర హైబ్రిడ్ పునరుత్పాదకత

**అమరావతి,సెప్టెంబర్2 :** ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో, బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీల సంయుక్త సంస్థ అయిన ఎవ్రెన్ అభివృద్ధి చేస్తున్న 552 మెగావాట్ పీక్ యుటిలిటీ-స్కేల్ సౌర విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) కాంట్రాక్టును యాక్సిస్ ఎనర్జీ దక్కించుకుంది. రాబోయే 18 నెలల్లో ఈ ప్రాజెక్టును ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది యాక్సిస్ ఎనర్జీ యొక్క స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టుల విస్తరణలో ఒక ముఖ్యమైన భాగంగా నిలవడంతో పాటుగా ఎవ్రెన్‌తో దాని వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఈ సోలార్ ప్రాజెక్టు 400 మెగావాట్ల పవన-సౌర హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులో భాగంగా ఉంది. ఇందులో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ( ను అనుసంధానించి, రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ యొక్క గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను తీర్చటానికి అనుగుణంగా రూపొందించబడిన ఈ ప్రాజెక్ట్, గరిష్ట వినియోగ సమయాల్లో పునరుత్పాదక విద్యుత్‌ను అందిస్తుంది. ఇది గ్రిడ్ విశ్వసనీయతను పెంచుతూ, రాష్ట్ర స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు మద్దతు ఇస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లోని 640.5 మెగావాట్ల పవన విద్యుత్ విభాగానికి సంబంధించిన ఈపీసీ పనులను కూడా యాక్సిస్ ఎనర్జీ చేపడుతోంది, ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా యాక్సిస్ ఎనర్జీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మురళీ సూరపనేని మాట్లాడుతూ, "బీబీబీ ప్రాజెక్ట్‌లోని సౌర విద్యుత్ విభాగానికి సంబంధించి ఈపీసీ కాంట్రాక్టును దక్కించుకోవడం యాక్సిస్ ఎనర్జీకి ఒక ముఖ్యమైన మైలురాయి. ఇది ఎవ్రెన్‌తో మా దీర్ఘకాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఈ ప్రతిష్ఠాత్మక హైబ్రిడ్ ప్రాజెక్టులో పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏకకాలంలో అమలు చేయడం ద్వారా సమగ్ర పునరుత్పాదక ఇంధన పరిష్కారాన్ని అందించే అరుదైన అవకాశం మాకు లభించింది. అత్యుత్తమ ఇంజినీరింగ్ నైపుణ్యం, సమర్థవంతమైన కార్యకలాపాల నిర్వహణతో పాటు ప్రపంచస్థాయి ప్రాజెక్టు అమలు సామర్థ్యాలను సమన్వయం చేసి, ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నాం. విశ్వసనీయమైన, విస్తరించదగిన, సుస్థిరమైన స్వచ్ఛ ఇంధన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా భారతదేశ ఇంధన పరివర్తనకు మద్దతు ఇవ్వాలనే మా నిరంతర నిబద్ధతను ఈ ప్రాజెక్ట్ ప్రతిబింబిస్తుంది" అని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీఎస్పీడీసీఎల్)తో దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏలు) మద్దతుగా ఉన్నాయి. పవన, సౌర విద్యుత్ ఉత్పత్తితో పాటు బ్యాటరీ నిల్వ వ్యవస్థను సమగ్రంగా అనుసంధానించడం వల్ల పునరుత్పాదక విద్యుత్‌ను మరింత విశ్వసనీయంగా వినియోగించుకోవచ్చు. అలాగే, విద్యుత్ ఉత్పత్తిలో ఉండే హెచ్చుతగ్గులను నిర్వహించడంతో పాటు, గరిష్ఠ డిమాండ్ సమయంలో విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఇది దోహదపడుతుంది.

# ఉక్రెయిన్‌పై దాడిలో జగిత్యాల వాసి మృతి

**జగిత్యాల,సెప్టెంబర్2 :** ఉక్రెయిన్‌పై రష్యా చేసిన భారీ దాడిలో జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్‌గౌడ్(42) మృతి చెందాడు. మంగళవారం ఉదయం తాను నివాసం ఉంటున్న గది నుంచి బయటకు వచ్చిన సమయంలోనే ఈ దాడి జరగడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు విడి చాడు. స్వగ్రామంలో సెంట్రింగ్ పని చేసిన సుదర్శన్‌గౌడ్ నాలుగు నెలల క్రితమే ఉపాధి నిమిత్తం ఉక్రెయిన్ వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున కీవ్ సహా పలు ప్రాంతాలపై క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు.. కాగా సుదర్శన్‌గౌడ్‌తో పాటు ఉక్రెయిన్‌లో ఉంటున్న తాటిపెల్లి గ్రామానికి చెందిన వేణు ద్వారా ఈ ఘటన గురించి మృతుడి కుటుంబసభ్యులకు తెలిసింది.

# బిఆర్‌ఎస్ నిరసనలో మల్లారెడ్డి స్టెప్పులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 02:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎక్కడుంటే అక్కడ హంగామా ఉంటుంది. కార్యక్రమం ఏదైనా తనదైన ఆట పాటలతో అందరిని హుషారెత్తిస్తుంటారు. మరోసారి తనదైన స్టెప్పులతో అందరిని అలరించారు. వివరాల్లోకి వెళ్తే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నేటితో వెయ్యి రోజులు పూర్తి చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాని, కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడిక్కడ నిరసనలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి నిరసన కార్యక్రమంలో పాల్గొని హంగామా చేశారు. యువకులతో కలిసి కాంగ్రెస్ మోసాలను ఎండగడుతూ యువత సమానంగా డ్యాన్సలు వేసి కార్యకర్తల్లో సరికొత్త జోష్ నింపారు. మళ్లీ బీఆర్ఎస్‌ని గెలువాల్సిన అవసరాన్ని ఊర మాస్ స్టెప్పులతో ప్రజలకు అర్థం చేయించారు.

# అంతుచిక్కని ప్రకృతి విలయం

**1127కి చేరిన వరద మృతుల సంఖ్య**

**4858 మంది కోసం ఇంకా గాలింపు**

**డీఎన్ఏ టెస్టుల ద్వారా శవాల గుర్తింపు**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 :** ప్రళయంలా విరు చుకుపడిన వరదలతో నేపాల్‌లో మరణమృదంగం కొనసాగుతోంది. ఊహించని విధంగా సంభవించిన ప్రకృతి విలయానికి అక్కడి ప్రజలు వేల సంఖ్యలో ప్రాణాలు వదిలారు. తాజా లెక్కల ప్రకారం వరద మృతుల సంఖ్య 1127కి చేరిందని అక్కడి అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి వరకూ ఆచూకి దొరకని వారి సంఖ్య కూడా సుమారు 5 వేల మందిపైగా ఉంటుందని అంచనా వేశారు.నేపాల్ వరదల్లో ఒక్క చిత్వాన్ జిల్లాలోనే అత్యధికంగా అంటే 348 మంది మృతదేహాలను వెలికితీశారు సహాయక బృందాలు. వారితో పాటు మరో 6,541 మందిని ప్రాణాలతో కాపాడి సురక్షిత ప్రదేశాలకు తరలించాయి రెస్క్యూ టీమ్స్. నేపాల్‌లో వరదలతో ఏర్పడిన విధ్వంసానికి సంబంధించిన చేదుజ్ఞాపకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మొదట వెయ్యి మంది వరకు గల్లంతైనట్లుగా భావించిన అధికారులు ..ఇప్పుడు వరదల్లో చిక్కుకొని, గల్లంతైన వారిలో చనిపోయిన వారి సంఖ్యే 12 వందలకు చేరుకుంటోంది. 1127 మంది చనిపోయినట్లుగా నేపాల్ పోలీస్ వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. ఇక వరదల్లో గల్లంతై, బురదల్లో చిక్కుకుపోయిన వాళ్ల సంఖ్య కూడా 4858 మంది వరకు ఉన్నారని అక్కడి జనాభా లెక్కల ప్రకారం తెలుస్తోంది. మరీ ముఖ్యంగా చిత్వాన్ జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో మృతదేహాలను వెలికి తీశారు. గత వారం రోజులకుపైగా కొనసాగుతున్న సహాయకచర్యల్లో భాగంగా ఇప్పటి వరకు 348 మృతదేహాలను వెలికితీశారు. నవల్‌పరాసి ఈస్ట్‌లో 217, నవల్‌పరాసి వెస్ట్‌లో 190, నువాకోట్‌లో 155 మంది ప్రాణాలు కోల్పోయారు. ధాడింగ్, గోర్ఖా, రసువా, తనాహుల జిల్లాల్లో కూడా చనిపోయిన వారి సంఖ్యలో వందల్లోనే ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇక నేపాల్ వరదల్లో చిక్కుకున్న వారు, గల్లంతైన వారితో పాటు తీవ్రంగా గాయాలపాలైన వాళ్ల కోసం కోసం రెస్క్యూ బృందాలు విస్తృతంగా శ్రమిస్తున్నాయి. 7,912 మంది పోలీసు సిబ్బంది వరదలు సంభవించిన 4 జిల్లాల్లో 6,541 మందిని రెస్క్యూ టీమ్‌లు సురక్షితంగా రక్షించాయి. ఇప్పటివరకు లభ్యమైన మృతదేహాల్లో కేవలం 95 మృతదేహాలను మాత్రమే కుటుంబ సభ్యులు గుర్తించి తీసుకెళ్లారని నేపాల్ ప్రధాని బాలెన్ షా తెలిపారు. గుర్తు పట్టలేని విధంగా ఉన్న శవాలకు డీఎన్ఏ నమూనాలు సేకరించి భద్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు. నేపాల్‌లో సంభవించిన వరదలు ఆకస్మిక వరదలు మాత్రమే కాదని రాకాసి వరదలుగా చూస్తున్నారు అక్కడి ప్రజలు.

(మొదటిపేజీ తరువాయి)

# ఎటు చూసినా విధ్వంసం, వికృతం

సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు. ఎంగిలి విస్తరాకుల దగ్గర కుక్కలు కొట్టుకున్నట్లు.. రాష్ట్ర సంపాదన కోసం మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకున్నారు. ప్రజా పాలన కాదు వెయ్యి రోజుల శని పాలన అన్నారు. వెయ్యి రోజులుగా ప్రజలకు నరకం చూపిస్తున్నారు. ఆర్థిక, సామాజిక విధ్వంసం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. ఈ శతాబ్దం అతి పెద్ద మోసం కాగ్రెంస్ మోనిఫెస్టో అని విమర్వచించరు. జల ద్రోహం చేస్తున్న జలగల పాలన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు చంచాగిరి చేస్తూ గురువుగారికి దక్షిణగా కృష్ణా, గోదావరి నీళ్లు ఇస్తున్నాడు. అందాల పోటీలకు పెట్టిన ఖర్చులో పదో వంతు ఖర్చు చేస్తే కాఫర్ డ్యాం కట్టి నీళ్లు ఇయ్యొచ్చని ఇంజిర్లు చెప్పారు. వారికి బెల్టు ట్రీట్‌మెంట్ ఉంటుందని భయపెట్టారన్నారు. ఎస్ఎల్‌బీసీ కుప్పకూల్చినా, చెక్కు డ్యాంలు కూలినా బీజేపీ, ఎన్‌డీఎస్‌ఏ నోరు తెరువదు. జీఆర్ఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఎజెండా పెడితే పారిపోతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మోచేయి నీళ్లు తాగే అధికారి ఆదిత్య నాద్ దాస్ ను సలహాదా రుగా పెడితే తెలంగాణకు నీళ్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూములను కొల్లగొడుతున్నారు. రూ.50 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని రూ.20 కోట్లతో ముగించారని మండిపడ్డారు. నీళ్లు అడిగితే కోసి రక్తం చల్లమన్నారు. యూరియా అడిగిన రైతులపై లాఠీ చార్జి చేశారు. కాళేశ్వరంపై కక్ష రైతన్నకు శిక్ష, మోటర్లుకు మీటర్లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు బందు అయింది. రాహుల్ బంధ్ చాలయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగున్నర కోట్ల అప్పు చేశారు. రియల్ ఎస్టేట్ కుప్ప కూలింది. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడున్నది అచ్చ కాంగ్రెస్ కాదు, పచ్చ కాంగ్రెస్ కాదు, లుచ్చ కాంగ్రెస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో అసలైన కాంగ్రెస్ లేదని తెలంగాణ సమాజాం అనుకుంటుందన్నారు. మొదటి నుంచి వారికి కాకుండా మధ్యలో వచ్చిన వారికి అందలం ఎక్కించార న్నారు. పార్టీ కోసం పని చేసిన వారిని విస్మరించారన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఈ శతాబ్దం అతి పెద్ద మోసం కాగ్రెంస్ మోనిఫెస్టో అని విమర్శించారు.

# ఇన్వెస్ట్ తెలంగాణలో రక్షణ ఎక్స్‌పో ప్రారంభించండి

రంగంలోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు హాజరై మార్గనిర్దేశర చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో - 2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని అన్నారు. రక్షణ ఎక్స్‌పో-2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ సీఎం విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ఈ ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని ఆయనను కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ కోరారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీ వో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శిం చాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందు కు సహకరించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూసేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. రక్షణ శాఖ మొత్తం1,500 ఎకరాలు కోరిందని.. మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయి ంచేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రక్షణ శాఖ మంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాలకు ఈ భూమిని కేటాయించనున్నట్లు వివరించారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు

# తెలంగాణ చరిత్రను తుడిచేస్తున్నారు..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల ప్రారంభంలో పరకాల అమరధామం వద్ద నివాళులర్పించే అవకాశం రావడం తనకు గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. 1947లో ఇదే రోజున ఇదే ప్రాంతంలో దక్షిణాది జలియన్ వాలా బాగ్ గా చెప్పుకునే ఘటన చోటుచేసుకుందని రామచందర్ రావు పేర్కొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు గ్రామస్తులు సమావేశమైన సమయంలో రజాకారులు, నిజాం పోలీసులు వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారని.. ఈ ఘటనలో 22 మంది మరణించగా, పలువురు గాయపడ్డారని తెలిపారు. తెలంగాణ పోరాట చరిత్రలో కీలకమైన ఈ ఘటనను కొన్ని రాజకీయ పార్టీలు ఉద్దేశపూర్వకంగా విస్మరించాయని ఆయన ఆరోపించారు. అమరవీరుల త్యాగాలను చరిత్ర నుంచి ఎవరూ చెరిపివేయలేరని రామచందర్ రావు అన్నారు. త్రివర్ణ పతాకం కోసం వారు ప్రదర్శించిన ధైర్యం, చేసిన త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. నిజాం వ్యతిరేక పోరాటానికి ప్రేరణ ఇచ్చిన వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ పార్టీ అవమానపరుస్తోందని విమర్శించారు. సెప్టెంబర్ 17న తెలంగాణలోని ప్రతి గ్రామంలో విద్యార్థులు, యువత, ప్రజలు వందేమాతరం గీతాన్ని ఆలపించాలని పిలుపునిచ్చారు. ఇక తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా ఎందుకు నిర్వహించడం లేదని రామచందర్ రావు ప్రశ్నించారు. మజ్లిస్ పార్టీకి భయపడే కారణంగానే ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం లేదని ఆరోపించారు. ఇది కేవలం ఒక రాజకీయ అంశం కాదని.. తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతో పాటు, తెలంగాణ పోరాట చరిత్రకు సంబంధించిన అంశాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చుతామని స్పష్టం చేశారు.

# పాత, కొత్త డేటా సిరీస్‌లను పోల్చడం సరికాదు

ఆయన ఎద్దేవా చేశారు. ఇటీవల 2026 ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి సంబంధించి భారత జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదైనట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. అయితే, ఈ గణాంకాలపై ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్, మాజీ ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ వంటి ప్రముఖులు అనుమానాలు వ్యక్తం చేశారు. వృద్ధి రేటుకు అనుగుణంగా ఉద్యోగ కల్పన, పెట్టుబడులు ఎందుకు పెరగడం లేదని రాజన్ ప్రశ్నించగా, ప్రభుత్వం పాత జీడీపీ అంచనాలను సవరించి తగ్గించడం వల్లే ప్రస్తుత వృద్ధి రేటు అధికంగా కనిపిస్తోందని గార్గ్ విశ్లేషించారు. ఈ విమర్శలపై ఢిల్లీలో జరిగిన ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ వార్షిక సదస్సులో పీయూష్ గోయల్ స్పందించారు. విమర్శకులు పాత గణాంకాల సిరీస్‌ను ప్రస్తుత డేటాతో పోలుస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. "యాపిల్స్‌ను యాపిల్స్‌తోనే పోల్చాలన్న కనీస పరిజ్ఞానం కూడా వారికి లోపించింది" అని ఆయన చురకలంటించారు. తమ పదవీకాలాన్ని పూర్తి చేయలేకపోయిన వారే ఇప్పుడు విమర్శలకు దిగుతున్నారంటూ పరోక్షంగా కొందరు మాజీ అధికారులపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం గణాంకాలను సృష్టించదని, వాస్తవాలను ఎప్పటికీ దాచలేమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రతికూల మనస్తత్వం ఉన్నవారు నిజాలను వక్రీకరిస్తూ ప్రజలలో నిరాశను నింపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, 140 కోట్ల మంది భారతీయుల సమష్టి కృషితోనే ఈ రికార్డు స్థాయి వృద్ధి సాధ్యమైందని ఆయన ఉద్ఘాటించారు. ఇదే సమయంలో, బేస్ ఇయర్ మార్పుపై గణాంకాల మంత్రిత్వ శాఖ కూడా స్పష్టతనిచ్చింది. వృద్ధి రేటును కృత్రిమంగా పెంచే ఉద్దేశంతో పాత గణాంకాలను ఉద్దేశపూర్వకంగా తగ్గించలేదని వివరణ ఇచ్చింది.

# కూకట్‌పల్లిలో భముల ధరలకు రెక్కలు

వేలంలో మొత్తం 19 మంది బిడ్డర్లు ఉత్సాహంగా పాల్గొని ఎలాట్ల కోసం పోటీపడ్డారు. ఈ పోటీ కారణంగా హౌసింగ్ బోర్డు నిర్దేశిరచిన కనీస ధర కంటే అనేక ప్లాట్లు అధిక ధరలకు విక్రయమయ్యాయి. మొత్తం 16 ఎ÷-లాట్ల విక్రయం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.47.14 కోట్ల ఆదాయం సమకూరింది. వేలంలో గజం సగటు ధర రూ.1.79 లక్షలుగా నమోదైంది. కేపీహెచ్‌బీ ప్లాట్లకు భారీ డిమాండ్ ఉన్నట్లు ఈ వేలం ద్వారా మరోసారి వెల్లడైందని అధికారులు చెప్పారు. హైదరాబాద్‌లో కీలకమైన ప్రాంతాల్లో అందుబాటులోని హౌసింగ్ బోర్డు భూములకు కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. భూముల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని హౌసింగ్ బోర్డు ఎ÷-లాట్లకు కూడా పోటీ నెలకొంటోందని అన్నారు. వేలం పక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు హౌసింగ్ బోర్డు అధికారులు వెల్లడించారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయం హౌసింగ్ బోర్డు ఆర్థిక వనరులను పెంచడంలో కీలకంగా మారనుందని తెలిపారు. కేపీహెచ్‌బీ వైస్ చైర్మన్ వీపీ గౌతం మాట్లాడుతూ.. కేపీహెచ్‌బీ ఎ÷-లాట్లకు భారీ డిమాండ్ ఉందని పేర్కొన్నారు.

# అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది

- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న హామీని నెరవేర్చాం
- సింహాచలం, అరసవల్లికి నీటిని తరలిస్తాం
- ఉత్తరాంధ్రను ఉన్నతాంధ్రగా మార్చడమే లక్ష్యం
- అనకాపల్లిబహిరంగ సభలో సిఎం చంద్రబాబు



**అనకాపల్లి,సెప్టెంబర్ 2 :** ఉత్తరాంధ్ర దశాబ్దాల కలను సాకారం చేస్తూ, పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి గడ్డపై అడుగుపెట్టాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం సాధించిన ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా అనకాపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నామని, దాని ఫలితమే ఈ జలయజ్ఞమని అన్నారు.గత ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని, ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించారని చంద్రబాబు గుర్తుచేశారు. "ఆ దీవెనల ఫలితమే నేడు అనకాపల్లికి గోదావరమ్మను తీసుకురావడం. మొన్న వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణమ్మను మార్కాపురానికి తరలించాం. ఈరోజు పోలవరం ఎడమ కాలవ ద్వారా గోదావరిని అనకాపల్లికి తీసుకొచ్చాం. ఇది ఒక చారిత్రక ఘట్టం" అని ఆయన అన్నారు. హెలికాప్టర్‌లో వస్తున్నప్పుడు తూర్పు కనుమలు, అడవులు, వాగులను దాటుకుని తరలివస్తున్న గోదావరి జలాలను చూసి ఎంతో సంతృప్తి కలిగిందని తెలిపారు. "అనకాపల్లి బెల్లం ఎంత తీయగా ఉంటుందో, ఈ రోజు అంతే తీయగా ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని సీఎం వ్యాఖ్యానించారు. ఈ జల ప్రవాహం ఇక్కడితో ఆగదని, వచ్చే ఏడాది సింహాద్రి అప్పన్న చెంతకు, ఆ తర్వాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి పాదాల చెంతకు గోదావరి జలాలను తీసుకెళ్లి వంశధార నదికి అనుసంధానం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం చేసి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "గలగల గోదావరి, బిరబిరా కృష్ణమ్మ అని పాటల్లో విన్నాం. ఇప్పుడు దానిని నిజం చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంది. ఈ జల విజయం ప్రజల విజయం," అని ఆయన అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఈ ప్రాజెక్టును అనుసంధానించి 12 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రూ. 3,200 కోట్లు ఖర్చు చేస్తామని, 2028 నాటికి వాటిని జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2019 నాటికి మేము పోలవరం పనులను 72% పూర్తి చేశాం. కానీ తర్వాత వచ్చిన గద్దలి పార్టీ నిర్లక్ష్యంతో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు గోదావరి పాలయ్యే పరిస్థితికి వచ్చింది. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ. 500 కోట్లు కూడా ఖర్చు పెట్టని ఆ నాయకుడు, తన నివాసం కోసం రుషికొండలో ప్యాలెస్‌కు రూ. 500 కోట్లు ఖర్చు పెట్టారు. ఆ డబ్బుతో నాలుగైదు ప్రాజెక్టులు పూర్తయ్యేవి" అని ఆయన ఆరోపించారు. విశాఖకు డేటా సెంటర్ వస్తే నీరు, విద్యుత్ కొరత వస్తుందని ఇప్పుడు పేటీఎం బ్యాచ్‌తో ప్రచారం చేయిస్తున్నారని, కానీ ఐదు డేటా సెంటర్లకు అవసరమైన దానికంటే వందల రెట్లు ఎక్కువ నీటిని ఇచ్చే శక్తి తమకుందని స్పష్టం చేశారు. భోగాపురం, వెలిగొండలాగే ఈ ప్రాజెక్టు క్రెడిట్‌ను కూడా దొంగిలించేందుకు గత పాలకులు ప్రయత్నిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు. జలం ఉంటేనే జీవం, జీవితం," అని చంద్రబాబు అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా మొత్తం 4 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని, పరిశ్రమలకు 23 టీఎంసీల నీటిని కేటాయిస్తామని వివరించారు. అదానీ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్, గ్రీన్ హైడ్రోజన్, సెమీ కండక్టర్, ఫార్మా వంటి పరిశ్రమలతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయని అన్నారు. "ఒకప్పుడు హైదరాబాద్ పక్కన రంగారెడ్డి ఎలా అభివృద్ధి చెందిందో, రేపు అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది. ఉత్తరాంధ్ర నుండి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు వస్తారు. ఉత్తరాంధ్ర ఉత్తమాంధ్రగా, ఉన్నతాంధ్రగా మారుతుంది. ఇది ఖాయం, రాసిపెట్టుకోండి" అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టిసీమ, పురుషోత్తపట్నం ద్వారా నదుల అనుసంధానం చేశానని, ఇప్పుడు అనకాపల్లికి నీరు తెచ్చానని, రాబోయే మూడేళ్లలో రూ. 35,000 కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. "పాలకులం కాదు, మీకు సేవకులం. పదవి అంటే పెత్తనం కాదు, జవాబుదారితనం. మాకు అహంకారం లేదు, అంకితభావం ఉంది" అని అన్నారు. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'తో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెడదామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నార

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

- ప్రతీకారం తీర్చుకుంటాం..
- అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్!



**టెహ్రాన్,సెప్టెంబర్2 :** పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. అమెరికా దాడులతో మళ్లీ అనిశ్చితి ఏర్పడింది. మంగళవారం రాత్రి అమెరికా దాడులు చేయడంతో ఇరాన్ కూడా ప్రతీ కార దాడులకు దిగింది. ఇందుకు సంబంధించి ఇరాన్ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. ఇరాక్, జోర్డాన్‌పై ఇరాన్ ప్రత్యేక సైనిక దళం ఐఆర్‌జీసీ దాడి చేసింది. కువైత్, బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించాయి. సిరిక్ ప్రాంతంలో అమెరికా దాడి వల్ల ఓ పెళ్లింట విషాదం సంభవించిందని ఇరాన్ మీడియా పేర్కొంది. ఓ చిన్నారి సహా నలుగురు మృతి చెందారని, 50 మంది గాయపడ్డారని తెలిపింది. ఈ ఉదంతంపై ఇరాన్ సుప్రీం లీడర్ మండిపడ్డారు. యూఎస్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. యూఎస్‌కు తమ సైన్యం మర్చిపోలేని గుణపాఠం చెబుతుందని ఐఆర్‌జీసీ ప్రతినిధి హుస్సేన్ మొహబి పేర్కొన్నారు. ఈ దాడులు ఎందుకు చేశామా? అని చింతించేలా చేస్తామని హెచ్చరించారు. అయితే, హోర్ముజ్‌లో కమర్షియల్ నౌకలపై ఇరాన్ దాడి చేసే ప్రయత్నం చేయడంతోనే తాము దాడులు చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకూ దాడులు కొనసాగాయని పేర్కొంది. ఇక తమ భూభాగం వైపు వస్తున్న 13 బాలిస్టిక్ మిసైల్స్‌ను మార్గమధ్యంలోనే ధ్వంసం చేశామని జోర్డాన్ మిలిటరీ పేర్కొంది. మరో మూడు మిసైల్స్ నిర్మానుష్య ప్రాంతంలో కూలిపోయాయని తెలిపింది. ఇరాన్ దాడుల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పింది. బుధవారం ఉదయం ఇరాన్ ప్రయోగించిన పలు మిసైల్స్‌ను అడ్డుకున్నామని మరో ప్రకటనలో కువైట్ తెలిపింది. బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించినట్టు తెలిసింది. అమెరికా దాడుల్లో చిన్నారి మరణించినట్టు ఇరాన్ మీడియాలో వార్తలు రావడంపై యూఎస్ సెంట్‌కామ్ ప్రతినిధి స్పందించారు. ఇరాన్ దళాల లాగా తాము సామాన్య పౌరులను ఏనాడు టార్గెట్ చేయలేదని స్పష్టం చేశారు. దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ కౌంటీలో ఉన్న కుహెస్తక్ నగరంలో ఘోరం జరిగింది. ఒక నివాస గృహంలో జరుగుతున్న పెళ్లి వేడుకపై అమెరికా సేనలు క్షిపణితో దాడి చేశాయి. ఈ భయంకరమైన దాడిలో ఒక చిన్నారి సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని ఇరాన్ రెడ్ క్రెసెంట్ ప్రకటించింది. ఈ దారుణ ఘటనపై ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఇదొక అత్యంత క్రూరమైన నేరమని అభివర్ణించింది. అమెరికా చేసిన ఈ దారుణ కాండకు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. అమాయకులైన పౌరులపై జరుగుతున్న ఈ దాడులను చూస్తూ అంతర్జాతీయ సమాజం మౌనం వహించడం అత్యంత ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మౌనంగా ఉన్న దేశాలు రేపు తమ వంతు వచ్చినప్పుడు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని బఘాయి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# తెలంగాణ విమానాశ్రయాలను త్వరగా పూర్తి చేయండి







- కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సిఎం రేవంత్ భేటీ

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 :** తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్ర మంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రన్ వే ఫైలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. టెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నాపై చర్యలు తీసుకునే ముందు రేవంత్ సంగతి చూడండి

- పదేళ్ళు నేనే ముఖ్యమంత్రి అని ఎలా అంటారు
- రెడ్లకో న్యాయం..బిసిలకో న్యాయమా
- ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలతో కొండా సురేఖ భేటీ
- మీడియా ముందు సంచల వ్యాఖ్యలు

**హైదరాబాద్,సెప్టెంబర్2 :** నాపై చర్యలు తీసుకునే ముందు సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌పై సురేఖ డైరెక్ట్ అటాక్ చేశారు. ఢిల్లీలో హైకమాండ్‌ను కలిసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి పదేళ్లు సీఎం అని తనే చెప్పుకుంటున్నాడు. అది ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో ఇతర శాఖ మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. సీఎంపై మంత్రులు, నేతలు కూడా తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తనని రాజీనామా చేయమని, మరొకటిగాని నాకు ఎవరు చెప్పలేదు. హైకమాండ్‌కు రాతపూర్వకంగా అన్ని వివరాలు తెలియజేశానని తెలిపారు. నా బిడ్డ మాట్లాడితే నాకెందుకు శిక్ష వేస్తారు. రెడ్లలో ఎంతో మంది అనుచిత వ్యాఖ్యలు చేశారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. బీసీకి ఒక న్యాయం ఇతర సామాజిక వర్గాలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. అంతా సద్దుమణిగింది అనుకునే తరుణంలో సురేఖ వ్యాఖ్యల అంతరార్థం ఏటంటనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నది. ఢిల్లీలో రాజీ మంత్రం బెడిసికొట్టడం వల్లే ఆమె ఇలా మాట్లాడుతుందే మోనని రాజకీయ విశ్లేషకులు అనుమానిస్తున్నారు. మరోవైపు సురేఖపై అధిష్ఠానానికి సీఎం నివేదికను అందజేశారు. సాధ్యమైనంత త్వరగా ఆమె చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఈరోజే కొండా సరేఖపై హైకమాండ్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లా డలేదని అన్నారు. అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేయాలని తనను కోరలేదని చెప్పారు. బీసీ అయిన తనకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజికవర్గాల నేతలపై పెద్దఎత్తున అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఏం సమాధానం చెబుతారని.. ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడిగారు. అన్ని అంశాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా అధిష్ఠాన పెద్దలందరికీ రాతపూర్వకంగా తెలియజేసినట్లు చెప్పారు.

# మరో పదిమంది నకిలీ వైద్యుల పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

సూరారం, పటాన్ చెరు, ఆర్‌సీ పురం తదితర పోలీసు స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో దాడులు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 10 నకిలీ క్లినిక్‌లను సీజ్ చేశారు. కేవలం టెన్త్, ఇంటర్, బీకామ్ వంటి చదువులు మాత్రమే చదివిన ఈ కేటుగాళ్లు, ఎలాంటి కనీస మెడికల్ నాలెడ్జ్ లేదా గుర్తింపు పొందిన డిగ్రీలు లేకుండానే క్లినిక్‌లు తెరిచి ప్రాక్టీస్ చేస్తున్నారని విచారణలో తేలింది.ఎలాంటి అర్హత లేకున్నా క్లినిక్‌లలో ఏకంగా బెడ్లు ఏర్పాటు చేసి, అమాయక రోగులకు, చిన్నపిల్లలకు సైతం వైద్యం అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో వచ్చే పేషెంట్లకు ఎడాపెడా సెలైన్లు, ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కిస్తూ ప్రాణాలపైకి తెస్తున్నారని పోలీసులు తెలిపారు. దాడుల సమయంలో ఈ క్లినిక్‌ల నుంచి పెద్ద ఎత్తున బీపీ మిషన్లు, స్టెతస్కోప్‌లు, గ్లూకోజ్ టెస్టింగ్ మిషన్లు, సిరంజీలతో పాటు భారీగా గడువు తీరిన ఔషధాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటి రెడ్డి మాట్లాడుతూ.. నకిలీ డాక్టర్ల వల్ల రోగుల ప్రాణాలకు తీవ్రమైన ముప్పు ఉందన్నారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు చికిత్స కోసం వెళ్లే ముందు సదరు వైద్యులకు సరైన మెడికల్ సర్టిఫికేషన్లు, అర్హతలు ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచించారు. మీ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎలాంటి అర్హత లేని వ్యక్తులు క్లినిక్‌లు నడుపుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే స్థానిక పోలీసులకు గానీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు గానీ సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# మరోమారు సిజెపి ఆందోళన !

కాక్రోచ్ జనతా పార్టీ మరో ఆందోళనకు సిద్ధమవుతోంది. కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీజేపీ సెప్టెంబర్ 5న ఈ మార్చ్ చేపడుతోంది. గతంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన సందర్భంగా కేసుల ఎత్తివేత, విద్యార్థులకు పరిహారం వంటి హామీలను కేంద్రం ప్రకటించింది. ఇదే సందర్భంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అయితే హామీలు అమలు చేయాలని గత కొంత కాలంగా సిజెపి డిమాండ్ చేస్తూనే ఉంది. సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన మార్చ్‌ను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు ఈ మార్చ్ నిర్వహించనున్నట్లు సీజేపీ ప్రకటించింది. ప్రస్తుతం ఈ అంశంలో న్యాయపరంగా జోక్యం చేసుకోవాల్సినంత అత్యవసర పరిస్థితి లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే నిరసన సందర్భంగా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో మరోమారు ఆందోళన చేస్తే ఢిల్లీలో ఉద్రిక్తతలు నెలకొంటాయని, మార్చ్‌కు అనుమతి నిరాకరించాలని రిటైర్డ్ పోలీస్ అధికారి సుప్రీంను ఆశ్రయించారు. సెప్టెంబర్ 5న జరగనున్న నిరసన మార్చ్ శాంతిభద్రతలు, విధానపరమైన అంశాలతో ముడిపడి ఉందని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. వీటిని సంబంధిత శాంతిభద్రతల సంస్థలు, ఇతర భాగస్వాములు పరిష్కరించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం కోర్టు జోక్యం చేసుకోవాల్సిన బలమైన కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేశారు. రిటైర్డ్ ఢిల్లీ పోలీస్ అధికారి రాజేంద్ర సింగ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జూలై 20న జంతర్ మంతర్ దగ్గర జరిగిన సీజేపీ నిరసన సందర్భంగా గాయపడిన పోలీసు సిబ్బందికి పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టాన్ని బాధ్యుల నుంచి వసూలు చేయాలని పిటిషన్‌లో కోరారు. పార్లమెంట్, ఇతర కీలక ప్రభుత్వ సంస్థలకు సమీపంలో నిర్వహించే నిరసనలకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించాలని పిటిషనర్ కోరారు. నిరసనలు నిర్వహించకూడని ప్రాంతాలు లేదా రక్షిత ప్రాంతాలను సహేతుకమైన పరిధిలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ అంశానికి సంబంధించిన అనేక విషయాలను ఇంకా పరిశీలించాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రతి అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించలేదని సీజేఐ స్పష్టం చేశారు. ముందుగానే దీనిపై ఎలాంటి నిర్ణయాలు ప్రకటించ లేమని సుప్రీం స్పష్టం చేసింది. అలాగే నిరసనలకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయించాలని సీజేఐ సూచించారు.

## సంపాదకీయం

అన్ని అంశాలను మేము పరిశీలించలేం. ప్రతి విషయంపైనా వ్యాఖ్యానించం. మేము ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయిం చండని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఒక్కో అంశాన్ని కమిటీ పరిశీలించి తమ అభిప్రాయాలను కోర్టుకు సమర్పిస్తుందని తెలిపారు. ఈ కమిటీని సీజేఐ 'తటస్థ అంపైర్'గా అభివర్ణించారు. నిరసనలకు సంబంధించిన విస్తృత విధానపరమైన, శాంతిభద్రతల అంశాలపై సంబంధిత వర్గాలు చర్చించు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు సీజేపీ తాజా నిరసన మార్చ్ నిర్వహించనున్నట్లు కోర్టుకు తెలియజేశారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనున్న విషయాన్ని పిటిషనర్ సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విదేశీ ప్రముఖులు ఢిల్లీకి రానున్న నేపథ్యంలో భద్రతా పరమైన ఆందోళనలు ఉన్నాయని, అందువల్ల నిరసన మార్చ్‌ను బ్రిక్స్ సదస్సు పూర్తయ్యే వరకు వాయిదా వేయాలని ఆయన వాదించారు. అయితే సీజేఐ స్పందిస్తూ.. 'ఇవి శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలు. నిర్ణయం శాంతిభద్రతల సంస్థలే తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని మేము విశ్వసిస్తున్నాం, ఆశిస్తున్నాం. ప్రస్తుతానికి మేము జోక్యం చేసుకోవడానికి బలమైన కారణాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ నిరసన సందర్భంగా ఏదైనా అవాంఛనీయ లేదా ఆందోళనకర ఘటన చోటుచేసుకుంటే.. పిటిషనర్ కొత్తగా దరఖాస్తు చేసుకుని కోర్టును ఆశ్రయించవచ్చని సీజేఐ తెలిపారు. ఈ కేసును నిరసనలు, వాటికి సంబంధించిన ఇతర అంశాలపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో కలిపి తదుపరి విచారణకు తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. మొత్తంగా ఇప్పుడు సెప్టెంబర్ 5 మరోమారు చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీలో ర్యాలీతో నిజంగానే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందా అన్నదే ప్రశ్న. ఎందుకంటే గత ఆందోళనలో అసాంఘిక శక్తులు చేరాయి. ఖలిస్తాన్, ఇస్లామిక్ ఉగ్రవాదులు చేరారన్న సమాచారం ఇంటిలిజెన్స్ వద్ద ఉంది. ఈ క్రమంలో ఢిల్లీ పోలీసులు తీసుకునే నిర్ణయం కీలకం కానుంది.

# మదర్సా విస్తరణ కోసం దుర్మార్గం

### పాక్‌లో పురాతన హిందూ ఆలయం కూల్చివేత

**లాహోర్,సెప్టెంబర్2 :** పాకిస్థాన్‌లో దారుణం జరిగింది. ఓ పురాతన హిందూ దేవాలయాన్ని నిర్దాక్షిణ్యంగా కూల్చేశారు. దేశ విభజన తరవాత ఎన్నో దేవాలయాలను కూల్చిన పాక్ ప్రభుత్వం తాజాగా మరో పురాతన దేవాలయాన్ని కూల్చింది. మదరసా విస్తరణ కోసం 100 ఏళ్ల నాటి హిందూ దేవాలయాన్ని కూల్చేసిన ఘటన పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో చోటుచేసుకుంది. న్యూస్ ఏజెన్సీ రిపోర్టు ప్రకారం.. లాహోర్‌కు దాదాపు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న నరోవాల్ జిల్లాలోని 'సిరాజ్' అనే గ్రామంలో 100 ఏళ్లనాటి ఓ ఆలయం ఉంది. ఆ ఆలయం సుమారు 1,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. ఆలయం పక్కనే మదరసా ఉంది. నిషేధిత తీవ్రవాద ఇస్లామిక్ పార్టీ 'తెహ్రీక్-ఇ-లబ్బైక్ పాకిస్తాన్'కి చెందిన కొందరు వ్యక్తులు మదరసాను విస్తరించటం కోసం ఆగస్టు 21వ తేదీన ఆలయాన్ని కూల్చివేశారు. ఆలయ శిఖరానికి సంబంధించిన మెటల్ ఫిట్టింగులను, ఇటుకలను అక్కడి నుంచి తరలించారు. హక్కుల కార్యకర్తలు ఈ సంఘటనపై వెంటనే దర్యాప్తు చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కూలగొట్టిన చోటే ఆలయాన్ని పునర్నిర్మించాలని స్థానిక నాయకులు, మైనారిటీ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. సంఘటనపై ప్రభుత్వ వాదనలు భిన్నంగా ఉన్నాయి. 100 నుంచి 125 ఏళ్ల చరిత్ర కలిగిన ఆ గుడి భారీ వర్షాల కారణంగా కూలిపోయిందని ప్రభుత్వం అంటోంది. ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డ్ అధికారి మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రభుత్వ రికార్డుల్లో గుడికి పేరు లేదు. అది చాలా పురాతనమైన గుడి. 100 నుంచి 125 సంవత్సరాల పాతది. భారీ వర్షాల కారణంగా గుడి కూలిపోయింది. ఆ భూమిని ఎవ్వరికీ లీజుకు ఇవ్వలేదు. గుడిని పునర్నిర్మించే బాధ్యత మా అధికారులు తీసుకుంటారని తెలిపారు.

# నేపాల్ వరదల్లో కొట్టుకు పోయిన బ్యాంక్ లాకర్లు

- వాటిని కాపలా కాస్తూ..

**పోయిన వాటి కోసం వెదుకులాట**



**ఖాట్మండ్,సెప్టెంబర్2 :** నేపాల్ వరదలు సృష్టించిన బీభత్సం పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించింది. అకస్మాత్తుగా వచ్చిన వరదలను ఎదుర్కొనడానికి నేపాల్ ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తోంది. అయితే ప్రస్తుతం ఓ సమస్య నేపాల్ ప్రభుత్వానికి, పోలీసులకు కంటి మీద కునుకు రాకుండా చేస్తోంది. భారీస్థాయిలో వచ్చిన వరదల వల్ల సుమారు 20 బ్యాంకులకు చెందిన లాకర్లు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఆ లాకర్లు దుండగుల చేతుల్లోకి చిక్కకుండా వాటిని సురక్షితంగా స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు తీవ్రస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ లాకర్లలో భారీ మొత్తంలో నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. డీఐజీ అబి నారాయణ్ మీడియాతో మాట్లాడుతూ.. ఆకస్మిక వరదల నేపథ్యంలో గల్లంతైన వ్యక్తుల కోసం గాలించడం, వారిని రక్షించి సురక్షిత ప్రాంతాల్లోకి తరలించడానికే పోలీసులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా వరద ప్రభావిత ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత కూడా తమపైనే ఉందని డీఐజీ పేర్కొన్నారు. రసువా, ధాదింగ్, చిత్వన్ తదితర ప్రాంతాల్లోని పలు బ్యాంకులు వరదల ధాటికి తీవ్రంగా దెబ్బతిన్నాయని నారాయణ్ తెలిపారు. వరదల్లో కొట్టుకుపోయిన లాకర్లలో బంగారం, విలువైన వస్తువుల గల లాకర్లే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. మరికొన్ని లాకర్లు బురద కింద కూరుకుపోయాయని, పోలీసులు వాటిని వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన చెప్పారు. కొట్టుకుపోయిన లాకర్లలో కొన్నిటిని దుండగులు పగులకొట్టి నగదు, బంగారాన్ని దోచుకున్నట్లు గుర్తించామని డీఐజీ నారాయణ్ పేర్కొన్నారు. ఎగువ రసువా ప్రాంతంలో వరదల్లో కొట్టుకుపోయిన ఓ లాకర్‌ను చేజిక్కించుకున్న దుండగులు 92 లక్షల నేపాలీ రూపాయలను దొంగిలించినట్లు గుర్తించామని ఆయన తెలిపారు. కానీ, ఆ లాకర్‌లో 1.5 కోట్ల నగదుతో పాటు 50 కోట్ల విలువైన బంగారం ఉండాలని బ్యాంక్ అధికారులు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన నగదు, బంగారం ఎలా మాయమయ్యిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, మరో ఘటనలో 'కృషి వికాస్ బ్యాంక్'కు చెందిన లాకర్లను పోలీసులు సురక్షితంగా స్వాధీనం చేసుకున్నట్లు డీఐజీ నారాయణ్ తెలిపారు.

# తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?



- తెరపైకి రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు
- ఇప్పుడే అలాంటి చర్చ అవసరం లేదన్న ట్రంప్

**వాషింగ్టన్,సెప్టెంబర్2 :** అమెరికా తదుపరి అధ్యక్షుడిగా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు తెరపైకి వస్తున్న వేళ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2028 ప్రెసిడెంట్ ఎలక్షన్స్‌లో పోటీచేసే అవకాశాలపై మాట్లాడిన అగ్రరాజ్య అధ్యక్షుడు.. ఆ విషయమై ఇప్పుడే చర్చ అక్కర్లేదని సమాధానాన్ని దాటవేశారు. 'హెగ్సెత్ అద్భుతంగా పనిచేస్తున్నారు. అయితే ఇలాంటి విషయాల గురించి మాట్లాడేందుకు ఇది తొందరపాటు చర్య అవుతుంది. ముందుగా నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికలను పూర్తి చేయాలి' అని ట్రంప్ అన్నారు. యూఎస్ ప్రెసిడెంట్‌గా రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశమున్న ట్రంప్.. 2029లో ఆ పదవి నుంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఉద్యమాన్ని ముందుకు నడిపించే తదుపరి నేత ఎవరన్న దానిపై రిపబ్లికన్ పార్టీలో చర్చ జోరందుకుంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్లు ఇప్పటికే వినిపిస్తున్నా.. తాజాగా ఆ లిస్ట్‌లో హెగ్సెత్ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఐయోవా స్టేట్ ఫెయిర్‌లో రిపబ్లికన్ల తరఫున హెగ్సెత్ ప్రచారం చేయడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చినట్లైంది. అయితే ఈ వార్తలను హెగ్సెత్ ఖండించారు. అవి '100 శాతం అవాస్తవం' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారాయన. హెగ్సెత్ గతంలో ఆర్మీ నేషనల్ గార్డ్‌లో పనిచేశారు. అనంతరం ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన రాజకీయ భవితవ్యంపై ట్రంప్ మరింత ఆసక్తికరంగా స్పందించారు. 'ప్రస్తుతం ఆయనకు సైన్యం, సైనికుల సంక్షేమం తప్ప మరేదీ ముఖ్యం కాదు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 2028 అధ్యక్ష ఎన్నికల కోసం పలువురు నేతలు ఇప్పటికే అంతర్గతంగా సన్నాహాలు ప్రారంభించి ఉండొచ్చని ట్రంప్ చెప్పారు. ఏది ఏమైనా ట్రంప్ వారసుడిగా అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించనప్పటికీ.. జేడీ వాన్స్, మార్కో రూబియో, హెగ్సెత్ వంటి పేర్లు వినిపిస్తుండటం రిపబ్లికన్ పార్టీలో 2028 పోరుపై ఆసక్తి రేపుతోంది.

# అదనపు సంచాలకులుగా డి.ఎస్. జగన్

- అభినందనలు తెలిపిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,సెప్టెంబర్2 :** సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జగన్‌కు అభినందనలు తెలియజేశారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుంద రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

# రష్యా సైన్యంలో 51మంది భారతీయులు మృతి

- విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడి



**న్యూఢిల్లీ,సెప్టెంబర్2 :** రష్యా సైన్యంలోని 51 మంది భారతీయులు మరణించారని విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడించారు. మొత్తం 227 మంది రష్యాలో సైన్యంలో చేరగా ఇప్పటివరకూ 139 మంది బయటకు వచ్చేశారని అన్నారు. మిగిలిన వారినీ వెనక్కు తీసుకొచ్చేందుకు రష్యాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కిర్గిస్థాన్ పర్య టన నేపథ్యంలో సోమవారం మీడియా అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ సెక్రటరీ ఈ వివరాలను వెల్లడించారు. ఈ అంశంలో రష్యాతో వివిధ స్థాయిల్లో చర్చలు జరుగుతున్నాయని మిశ్రీ చెప్పారు. మాస్కోలోని భారతీయ ఎంబసీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ భారతీ యులను వెనక్కు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. భారతీయులు త్వరగా సైన్యం నుంచి డిశ్చార్జ్ అయ్యేలా రష్యా చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. రష్యా-భారత్ వాణి జ్యం గురించి కూడా మిశ్రీ మాట్లాడారు. గతేడాది భారత్‌లో రష్యన్ దిగుమతిదారుల సమావే శంలో అక్కడి సంస్థలు ఉత్సాహంగా పాల్గొన్నాయని చెప్పారు. భారత్ నుంచి దిగుమతులను పెంచేందుకు ఉత్సుకత ప్రదర్శించాయని చెప్పారు. తదుపరి రష్యాలో జరుగునున్న సమావేశంలో భారతీయ ఎగుమతిదారుల ఫోరం సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సానుకూలంగా స్పందించారని అన్నారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఇటీవల కిర్గ్ రిపబ్లిక్ దేశ పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా సమావేశం అయ్యారు. యుద్ధాలకు శాశ్వత ముగింపు పలికేందుకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సానుకూలత

- 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన
- నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన
- సాంకేతిక నివేదిక అనంతరం తదుపరి చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు

**రామ్మోహన్ నాయుడి హామీ**




**న్యూఢిల్లీ,సెప్టెంబర్2 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనకు సంబంధించి నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది. న్యూఢిల్లీలో మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమైన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేవని తేలడంతో, తాజాగా నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని చెప్పారు. కేంద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల గుర్తుచేసుకున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రాధాన్యాన్ని, జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# వైఎస్సార్ ఆశయాల సాధనకు కృషి చేద్దాం

**– రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

బలగం టీవీ,వేములవాడ:

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పనిచేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు మండుటెండల్లో సుదీర్ఘ పాదయాత్ర చేపట్టి ప్రజల మన్ననలు పొందారని అన్నారు . ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే తొలి సంతకం చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. జలయజ్ఞం ద్వారా అనేక సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి రైతాంగానికి సాగునీటి సౌకర్యం కల్పించే దిశగా చర్యలు చేపట్టారని తెలిపారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి పునాది వేసి, పలు రిజర్వాయర్లు, కాలువల నిర్మాణానికి మార్గం సుగమం చేశారని అన్నారు . 2006లో వేములవాడ నియోజకవర్గంలోని మల్యాల వద్ద జరిగిన ఇందిరమ్మ గ్రామసభకు వైఎస్సార్ స్వయంగా హాజరై ఈ ప్రాంత అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు



చేశారనిఅన్నారు . ఎల్ఎండీ ప్రాజెక్టు ద్వారా వరద కాలువ నీటిని మళ్లించి ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఆనాడే ప్రణాళికలు రూపొందించారని అన్నారు .

పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కూడా వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసి లక్షలాది కుటుంబాలకు వైద్య భరోసా కల్పించారని పేర్కొన్నారు. వైఎస్సార్ మరణం కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు తీరని లోటని, ఆయన ఆశయాలు, సంక్షేమ పాలన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు .

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను తిరిగి కొనసాగిస్తూ సాగునీటి రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాళేశ్వరం సూరమ్మ ప్రాజెక్టు భూసేకరణకు రూ.80 కోట్లు కేటాయించి పనులను ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు.వైఎస్సార్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



## రాజన్నపేట పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట ఎంపీ యూపీఎస్ పాఠశాలలో బుధవారం విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. విద్యార్థులందరూ సమానత్వ భావనతో పాఠశాలకు హాజరై, క్రమశిక్షణతో విద్యను అభ్యసించేందుకు యూనిఫామ్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంజుల, గ్రామ సర్పంచ్ కల్లూరి బాపురెడ్డి, ఉప సర్పంచ్ ఉడుగుల యాదగిరి, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ శంకర్, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, ఉపాధ్యాయులు ప్రవీణ్ రావు, విజయలక్ష్మి, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అశ్విని హాస్పిటల్ లో ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్..



బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అశ్విని హాస్పిటల్ వ్యవస్థాపకులు డా. జి. సత్యనారాయణ స్వామి మరియు డా.అభినయ్ గోవర్ధన్ ఐదు డయాలసిస్ మిషన్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. డా. జి సత్యనారాయణ స్వామి తెలుపుతూ...మన శరీరంలో కిడ్నీలు (మూత్రపిండాలు) రక్తాన్ని శుభ్రం చేసే ఫిల్టర్ లాంటివి. చెడిపోయినప్పుడు, రక్తంలోని వ్యర్థాలు, అదనపు నీరు,లవణాలు బయటకు పోకుండా శరీరంలోనే ఉండిపోతాయి.ఇది చాలా ప్రమాదమని అలాంటి సమయంలో కిడ్నీల పనిని యంత్రం ద్వారా చేయించడాన్ని "డయాలసిస్" అంటారు. దీనిని సింపుల్ గా చెప్పాలంటే - కృత్రిమంగా రక్తాన్ని శుభ్రం చేసే ప్రక్రియ అని అర్థం. రక్తాన్ని శరీరం బయటకు తీసి, ఒక మిషన్ (డయలైజర్) లో శుభ్రం చేసి, మళ్ళీ శరీరంలోకి పంపుతారు. వారానికి 2-3 సార్లు హాస్పిటల్ కి వెళ్లి 4 గంటలు చేయించుకోవాలి. డయాలసిస్ కిడ్నీని నయం చేయదు, కానీ కిడ్నీ ఫెయిల్ అయిన వ్యక్తి ప్రాణాలను నిలబెడుతుంది. కిడ్నీ మార్పిడి (ట్రాన్స్‌ప్లాంట్) వరకు లేదా జీవితాంతం సపోర్ట్ గా ఉంటుంది. అశ్విని హాస్పిటల్లో పేద ప్రజల సౌకర్యార్థం కోసం ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా డయాలసిస్ అందుబాటులో ఉందని ఇట్టి అవకాశాన్ని కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు.



## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

బలగం టీవీ,తంగళ్లపల్లి:

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా తంగళ్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మునిగెల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు . రైతుల అభ్యున్నతి, పేదల సంక్షేమం, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ఆయన అమలు చేసిన పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు . ముఖ్యమంత్రిగా వైఎస్సార్ అందించిన ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్ పార్టీకి మార్గదర్శకమని పేర్కొన్నారు.వైఎస్సార్ ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మునిగెల రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరాళ్ల నర్సింగం, ఇట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నాల పర్శరం, ఆరెపల్లి బాలు, రాములు, సర్పంచ్ సాధి, చుక్క శేఖర్, బైరివేని రాము, బండి పర్శరం, బాలసాని శ్రీనివాస్, భాను, హారిక, మిరాల శ్రీనివాస్, రాజేశ్వరరావు, చందు, మల్లేశం, సందీప్, జలందర్‌రెడ్డి, ప్రశాంత్, చోటు, గణేష్, భారత్, తిరుపతి, శ్యామ్, కిషన్, రాజిరెడ్డి, యోగి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మోసాలపై బీఆర్ఎస్ కదనభేరి..

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ జెడ్పీటీసీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి సెప్టెంబర్ 2 నాటికి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ జెడ్పీటీసీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను నెరవేర్చడంలో విఫలమైందని నాయకులు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, ప్రజలకు చేసిన వాగ్దానాలపై సమాధానం చెప్పేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి రాబోయే రోజుల్లో వివిధ నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు



నాయకులు వెల్లడించారు.ఈ సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్య శ్రేణులు పాల్గొని నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు.



## మున్నూరుకాపు కుటుంబ సర్వే–2026 పోస్టర్ ఆవిష్కరణ..

బలగం టీవీ, బోయినిపల్లి:

మున్నూరుకాపు సమాజ అభివృద్ధి, సంక్షేమం, ఐక్యతకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని సేకరించే లక్ష్యంతో నిర్వహిస్తున్న మున్నూరుకాపు కుటుంబ సర్వే–2026లో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని చొప్పదండి నియోజకవర్గం మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం ఇన్‌చార్జ్ మడ్లపల్లి శ్రీనివాస్ పటేల్ పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో మంగళవారం రోజున మండల మున్నూరుకాపు ప్రతినిధులతో కలిసి సర్వే పోస్టర్‌ను ఆవిష్కరించారు. మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ పటేల్‌తో పాటు బోయినిపల్లి మండలానికి చెందిన మున్నూరుకాపు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మడ్లపల్లి శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ: మున్నూరుకాపుల ఐక్యత, సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ఉపయోగపడే విధంగా డిజిటల్ డేటాబేస్ రూపొందించేందుకు కుటుంబ సర్వే చేపట్టినట్లు తెలిపారు. సేకరించిన సమాచారంతో భవిష్యత్‌లో సమాజ అవసరాలను గుర్తించి సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు దోహదపడుతుందని పేర్కొన్నారు.చొప్పదండి నియోజకవర్గంలోని మున్నూరుకాపు కుటుంబాలన్నీ, సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావడం ద్వారా సమాజ ఐక్యత మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి మండల మున్నూరుకాపు ప్రతినిధులు, రాజన్న సిరిసిల్ల జిల్లా సంయుక్త కార్యదర్శి మరియు తడగొండ మాజీ సర్పంచ్ చిందం రమేష్, దేశాయిపల్లి మాజీ సర్పంచ్ మాడిశెట్టి జనార్ధన్, బోయినిపల్లి మండల ప్రధాన కార్యదర్శి అమీరిశెట్టి భూమి రెడ్డి, బూరుగుపల్లి సర్పంచ్ పెంచాల సౌమ్య-మహేష్, తడగొండ మున్నూరు కాపు సేవా సంఘం అధ్యక్షులు సింగరి రమేష్, గౌరవ అధ్యక్షులు రేండ్ల కనకయ్య, వార్డు మెంబర్ బుర్ర రాజు, మాజీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కుల సంఘాల నాయకులు, కుల సభ్యులు పాల్గొన్నారు.

# రెడ్డి కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్లు కేటాయించాలి



**-సెప్టెంబర్ 8న ఇందిరాపార్క్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

రెడ్డి సామాజిక వర్గం సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, ఇందుకోసం సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఒకరోజు నిరాహార దీక్షను విజయవంతం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.

ఎల్లారెడ్డిపేట మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు కుంభాల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల సంఘ భవనంలో బుధవారం నిరాహార దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1,000 కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని కోరారు.గతంలో కేసీఆర్ ప్రభుత్వం రాజబహద్దూర్ వెంకటరామిరెడ్డి ట్రస్ట్ కోసం 15 ఎకరాల భూమిని కేటాయించిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ భూమిని తిరిగి తీసుకోవడం అన్యాయమని అన్నారు. వెంటనే ఆ భూమిని ట్రస్ట్‌కు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లను అన్ని విభాగాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.

రెడ్డి సామాజిక వర్గం సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒకరోజు నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. రెడ్డి సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల రెడ్డి సంఘం నాయకులు పారిపల్లి సంజీవరెడ్డి, వంగ శ్రీకాంత్‌రెడ్డి, గుర్రాల చంద్రమోహన్‌రెడ్డి, గోపూరి ప్రదీప్‌రెడ్డి, నేవూరి శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు



## మహిళా సంఘాల సభ్యులకు ఆరోగ్య పరీక్షలు..

బలగం టీవీ, తంగళ్లపల్లి:

తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా సంఘాల సభ్యులకు వైద్యుల ఆధ్వర్యంలో వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మహిళల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు అవసరమైన హెల్త్ టెస్టులు నిర్వహించడంతో పాటు, ఆరోగ్య పరిరక్షణపై వైద్యులు అవగాహన కల్పించారు. మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఈ సందర్భంగా వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోర, ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సింగం గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మునిగెల రాజు, డాక్టర్ స్నేహ, ఏపీఎం చంద్రయ్య పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చుక్క రాజా శేఖర్, గుగ్గిళ్ల భరత్, తిరుపతి తదితరులతో పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో తీరిన రైతుల కష్టాలు

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని అక్కపల్లి గ్రామంలో అదనపు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడంతో బుధవారం రైతుల కష్టాలు తీరినట్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్కే సాబేరా బేగం అన్నారు ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మాదాసు స్రవంతి బాబు తో కలిసి ట్రాన్స్ఫార్మర్ ను ప్రారంభించారు ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఎన్పీడీసీఎల్ ఏర్పాటు అయిన నుండి లో వోల్టేజ్ సమస్య తీరిందని అన్నారు రైతులకు ఇబ్బంది జరగకుండా 2 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో ఈ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు ఎన్పీడీసీఎల్ ఏఈ రాకేశ్ రెడ్డి డి ఈ లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నరసయ్యా ఉప సర్పంచ్ బాబు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిద రాజేందర్. నాయకులు కల్లూరు బాపురెడ్డి తిరుపతి మల్లయ్య యాదవ్ జనార్ధన్ రెడ్డి పోరెడ్డి శ్రీనివాసరెడ్డి. భూమిరెడ్డి. తదితరులు పాల్గొన్నారు



# ఓటీపీ చెప్పొద్దు.. మోసగాళ్లకు చికొద్దు..

- సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలి..
- ఎస్పీ మహేష్ బి. గితే



-బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, లింకులను నమ్మి మోసపోవద్దని, ముఖ్యంగా ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ నంబర్, ఆధార్ వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరించారు.తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా జిల్లా సైబర్ బృందం ఆధ్వర్యంలో బుధవారం నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ సాంకేతికత రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న తరుణంలో అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు అప్రమత్తతే ప్రధాన రక్షణ అని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల ద్వారా నకిలీ ఖాతాలు, మోసపూరిత లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఉపకార వేతనాలు, బహుమతులు, లక్కీడ్రాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు.అత్యాశ, భయం, అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్, సందేశాలు, లింకుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకూడదని, గుర్తుతెలియని యాప్‌లు, ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు.విద్యార్థులు చదువుతో పాటు సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించి సైబర్ నేరాల నివారణలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు.సైబర్ మోసానికి గురైనప్పుడు భయాందోళనకు గురికాకుండా వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదుల పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

### వివిధ మోసాలపై అవగాహన

జిల్లా సైబర్ బృందం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివిధ రకాల సైబర్ మోసాలపై అవగాహన కల్పించింది. రుణ యాప్‌లు, వాటా మార్కెట్ మోసాలు, కొరియర్ మోసాలు, క్రెడిట్ కార్డు మోసాలు, వివాహ సంబంధాల పేరుతో మోసాలు, లాటరీ, బహుమతుల మోసాలు, బహుళస్థాయి మార్కెటింగ్, క్రిప్టో కరెన్సీ, డిజిటల్ అరెస్టు, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాల గురించి వివరించారు.

### వినాయకుడి బోధనలతో సైబర్ భద్రత

వినాయక చవితి సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన 'వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు' అనే అవగాహన పోస్టర్‌ను జిల్లా ఎస్పీ విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. 'నయం కంటే నివారణ మేలు' అన్నట్లుగా సైబర్ భద్రతలో ముందస్తు అప్రమత్తత ఎంతో ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో తమకు కల్పించిన అవగాహన ఎంతో ఉపయోగకరంగా ఉందని, కుటుంబ సభ్యులు, స్నేహితులకు సైతం సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, సైబర్ నేరాల ఎస్ఐ జునైద్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, సైబర్ సెల్ సిబ్బంది గంగిరెడ్డి, రాజు, శ్రీకాంత్, విజయ్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజులు.. హామీలు శూన్యం

- వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి
- 420 అడుగుల ఫ్లెక్సీతో వేములవాడలో బీఆర్ఎస్ భారీ నిరసన ర్యాలీ



బలగం టీవీ,వేములవాడ: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోరుట్ల బస్టాండ్ చౌరస్తా నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు చేపట్టిన ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. 420 అడుగుల ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు 420కి పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వంద రోజుల్లో హామీలను నెరవేరుస్తామని చెప్పి, వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయలేదని అన్నారు .రైతులు, మహిళలు, యువత, వెనుకబడిన వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేయడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే 420 అడుగుల ఫ్లెక్సీతో వినూత్న నిరసన చేపట్టామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.హామీల అమలులో ప్రభుత్వం ఇదే వైఖరిని కొనసాగిస్తే నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలనుసమీకరించి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వేములవాడ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నియోజకవర్గానికి చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆరు గ్యారంటీలు.. అమలులో ఆమడదూరం..




- హామీలిచ్చి.. మరిచిపోయారు.. బాకీ కార్డులే సాక్ష్యం
- సిరిసిల్ల లో బాకీ కార్డులు, 420 అడుగుల ఫ్లెక్స్ ప్రదర్శన



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఏడు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో భారీ నిరసన తెలిపారు .ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు 'బాకీ కార్డులు' పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుతీరును ఎత్తిచూపుతూ 420 అడుగుల పొడవైన ఫ్లెక్స్‌ను ప్రదర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేలా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు ప్రభుత్వంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ, రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగారావు, మున్సిపల్ చైర్మన్ జిందం కళాచక్రపాణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, సింగిల్ విండో చైర్మన్లు, సెస్ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

-పెండింగ్ కేసుల పరిష్కారానికి ఈ నెల 12న ప్రత్యేక అవకాశం




బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజలు ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి. నీరజ అన్నారు .జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, పెండింగ్ కేసుల పరిష్కారంపై బుధవారం జిల్లా కోర్టు సముదాయంలో జిల్లాకు చెందిన న్యాయమూర్తులు, ప్రభుత్వ న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ మాట్లాడుతూ రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసులను గుర్తించి సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంతో పాటు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను తగ్గించేందుకు లోక్ అదాలత్ ఒక సమర్థవంతమైన వేదికగాఉపయోగపడుతుందని పేర్కొన్నారు.పోలీసు అధికారులు కూడా లోక్ అదాలత్ నిర్వహణలో సమన్వయంతో పనిచేయాలని, రాజీకి అవకాశం ఉన్న కేసుల వివరాలను పరిశీలించి సంబంధిత కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి ఉన్న అవకాశాలను తెలియజేయాలని సూచించారు. కేసుల పరిష్కారంలో అవసరమైన చర్యలు తీసుకుని లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని అన్నారు. ఈ నెల 12న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో పాల్గొని, పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసులను సత్వరంగా ముగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల/జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి పి. లక్ష్మణాచారి, సీనియర్ సివిల్ జడ్జి, వేములవాడ అజయ్‌కుమార్ జాదవ్, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, జూనియర్ సివిల్ జడ్జి కుమారి మేఘన, పోలీసు అధికారులు, కోర్టు మానిటరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి..

-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట: భూముల రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టి, వివరాల నమోదులో తప్పులు లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. భూ భారతి కింద ఎల్లారెడ్డిపేట మండలం సర్వాయిపల్లి గ్రామంలో రోవర్ యంత్రాలతో చేపడుతున్న భూములరీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులు, సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. గ్రామంలో ఉన్న రెవెన్యూ, అటవీ భూముల రీసర్వేకు సంబంధించిన వివరాలను అదనపు కలెక్టర్ ఆరా తీశారు. రీ సర్వే కు సంబంధించి గ్రామంలోని రైతులకు సమాచారం ఇచ్చారా లేదా అనే వివరాలను తెలుసుకున్నారు. నిబంధనల మేరకు సర్వే చేపట్టాలని అధికారులు, సర్వేయర్లను అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ వేణు, సర్వేయర్లు, తదితరులు ఉన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ..

-ఈ నెల 5, 6 12, 13 వ తేదీల్లో నిర్వహణ: - కలెక్టర్ గరిమ అగ్రవాల్



బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల: ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' కార్యక్రమములో భాగంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 05.09.2026 (శనివారం), 06.09.2026 (ఆదివారం) అలాగే ఈ నెల 12.09.2026 (శనివారం), 13.09.2026 (ఆదివారం) లలో ఓటరు నమోదు ప్రత్యేక ప్రచార కార్యక్రమము నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు.సంబంధిత బూత్ లెవల్ అధికారులు ప్రత్యేక ప్రచార కార్యక్రమం జరిగే రోజుల్లో నిర్దేశిత పోలింగ్ స్టేషన్‌లలో అందుబాటులో ఉంటారని తెలిపారుసంబంధిత బూత్ లెవల్ ఏజెంట్లు కూడా ప్రత్యేక ప్రచార కార్యక్రమం జరిగే రోజుల్లో నిర్దేశిత ప్రదేశాల్లో హాజరవుతారని పేర్కొన్నారు.బూత్ లెవల్ అధికారి , సంబంధిత బూత్ లెవల్ ఏజెంట్ల సమక్షంలో ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి, అందులో ఉన్న తప్పులు, సవరణలు మరియు ఇతర లోపాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు.ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమాల సందర్భంగా దరఖాస్తుదారులు / ఓటర్లు సంబంధిత నిర్దేశిత పోలింగ్ స్టేషన్‌లకు హాజరై ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించవచ్చని పేర్కొన్నారు.ఓటరు నమోదు అధికారుల కార్యాలయాల్లో క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలు సమర్పించే విధానంతో పాటు, ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా తమ క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలను కూడా సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.

## భీమేశ్వర స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఇంచార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ పూజలు.



బలగం టీవీ, వేములవాడ :వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఇంచార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ సీ హెచ్ హనుమంతరావు, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భీమేశ్వర స్వామి, గాయత్రి మాత, ఆంజనేయ స్వామికి వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ సీహెచ్ హనుమంతరావు, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, సీఎం ఓఎస్డీ శ్రీనివాసులుకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి.. ఆశీర్వచనం అందించారు. అంతకుముందు దేవాదాయ శాఖ ఇంచార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, సీఎం ఓఎస్డీకి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.

# టాస్ వేయడానికే రోజంతా పడుతుంది

## పాక్‌ను ట్రోల్ చేసిన పీటర్సన్!




ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో వరుసగా 2 మ్యాచ్‌లు ఓడిపోయిన పాకిస్థాన్ జట్టు తీవ్ర ఒత్తిడిలో కూరుకుపోయింది. మూడో టెస్టుకు ముందే మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘాలతో సహా ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపివేస్తూ పీసీబీ తీసుకున్న నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సీనియర్లను ఇంటికి పంపి వారి స్థానంలో ఐదుగురు అరంగేట్రం చేయని కొత్త ఆటగాళ్లను ఎంపిక చేయడంపై సోషల్ మీడియాలో నెటిజన్లు, మాజీ క్రికెటర్లు పెద్ద ఎత్తున వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. ఈ పరిణామాలపై ఇంగ్లాండ్ మాజీ సారథి కెవిన్ పీటర్సన్ తనదైన శైలిలో స్పందిం చాడు. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ అజామ్‌పై హాస్యభరితమైన కామెంట్లు చేశారు. "ప్రతి మ్యాచ్‌కి ముందు జరిగే విలేకరుల సమావేశంలో జట్లలో జరిగిన మార్పుల గురించి వ్యాఖ్యాతలు కెప్టెన్లను అడుగుతారు. ఇప్పుడు నా ఫ్రెండ్ బాబర్‌కు అది చాలా సుదీర్ఘమైన సమావేశం కానుంది. ఈ లెక్కన టాస్ వేసే ఘట్టం మ్యాచ్‌కి ఒక రోజు ముందే ప్రారంభించాలేమో" అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఎద్దేవా చేశారు. మరోవైపు పాకిస్థాన్ మాజీ కెప్టెన్, వ్యాఖ్యాత రమీజ్ రాజా కూడా తన సొంత క్రికెట్ బోర్డుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. "క్రికెట్ చరిత్రలో సిరీస్ మధ్యలో ఒక జట్టు ఇలా ఏడుగురు ఆటగాళ్లను, కోచ్‌లను మార్చడం నేను ఎప్పుడూ చూడలేదు. పాకిస్థాన్ నిజంగా ఒక కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇది ఫుట్‌బాల్ మ్యాచ్‌లా ఉంది.. సీజన్ మధ్యలోనే మేనేజర్‌ను తీసేసినట్లు చేస్తున్నారు. మరో పది రోజులు ఆగి సిరీస్ ముగిసాక ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేది" అని రమీజ్ రజా పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో మూడో టెస్టుకు ముందు పాక్ జట్టులో మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బైగ్, రాజావుల్లా, అరాఫత్ మిన్హాస్, ఇమ్రాన్ రంధావా వంటి ఐదుగురు అన్ క్యాప్డ్ ఆటగాళ్లను ఎంపిక చేశారు. వీరికి తోడు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను తొలగించి వారి స్థానంలో మైక్ హెస్సన్, యాష్లే నాఫ్కేలను నియమించారు. ఎన్నో వివాదాలు, ట్రోల్స్ మధ్య సెప్టెంబర్ 9న బర్మిం గ్హామ్ వేదికగా జరగనున్న ఆఖరి టెస్టులో బాబర్ సేన ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి.

# పాక్ క్రికెట్‌ను కుదిపేస్తున్న వివాదాలు



ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న పాకిస్థాన్ క్రికెట్ జట్టులో చోటుచేసుకున్న ఊహించని మార్పుల సంచలనం చల్లారకముందే పీసీబీకి మరో పెద్ద షాక్ తగిలింది. పాకిస్థాన్ క్రికెట్ సెలక్షన్ కమిటీలో సభ్యుడిగా ఉన్న ఆ జట్టు మాజీ కెప్టెన్ మిస్బా ఉల్ హక్ .. తన పదవికి రాజీనామా చేశాడు. లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ చేతిలో 194 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైన తర్వాత పీసీబీ తీసుకున్న నిర్ణయాలు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ క్రమంలోనే మిస్బా బోర్డుకు తన నిర్ణయాన్ని వెల్లడించాడు. మూడో టెస్టుకు ముందు మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్‌హక్, సల్మాన్ అఘా వంటి ఏడుగురు ప్రధాన ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించడం, అలాగే ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను తొలగించడం వంటి నిర్ణయాల్లో మిస్బాను బోర్డు సంప్రదించలేదని తెలుస్తోంది. జాతీయ ఎంపిక కమిటీలో కీలక సభ్యుడిగా ఉన్నప్పటికీ, తన అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపై అతడు తీవ్ర అసంతృప్తి చెందాడు. ఈ క్రమంలోనే సెలెక్టర్ పదవితో పాటు లాహోర్‌లోని నేషనల్ క్రికెట్ అకాడమీ బ్యాటింగ్ కన్సల్టెంట్ బాధ్యతల నుంచి కూడా తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్ 0–2తో చేజారడం, మూడో టెస్టులో ఘోర పరాభవం నుంచి తప్పించుకునేందుకు పీసీబీ ఏకంగా ఐదుగురు సరికొత్త అన్ క్యాప్డ్ ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంది. అరాఫత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్,సాద్‌బైగ్,మహమ్మద్ ఇమ్రాన్ రంధావా, రాజావుల్లా వంటి యువ ఆటగాళ్లను జట్టులో చేర్చింది. పరిమిత ఓవర్ల జట్టు కోచ్‌గా ఉన్న మైక్ హెస్సన్‌ను టెస్ట్ జట్టుకు కూడా హెడ్ కోచ్‌గానియమించింది.గత20టెస్టుల్లో 15 ఓటములతో ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న పాకిస్థాన్ జట్టులో ఈ మార్పులు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయో వేచి చూడాలి.పాకిస్థాన్ క్రికెట్ బోర్డులో మిస్బా ఉల్ హక్ చాలా ఏళ్లుగా భాగంగా ఉన్నాడు. 2019లో అతడు ఒకే సమయంలో హెడ్ కోచ్, చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత 2020లో చీఫ్ సెలెక్టర్ పదవికి,2021లో హెడ్‌కోచ్ బాధ్యతలకు స్వస్తి చెప్పాడు. తిరిగి 2023లో సలహాదారుగా, 2024 మార్చిలో నాలుగో సభ్యుడిగా సెలక్షన్ కమిటీలో చేరాడు. ఇటీవల ముల్తాన్‌లో జరిగిన జాతీయ ఛాంపియన్స్ కప్‌లో పాకిస్థాన్ గోల్డ్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించి విజేతగా నిలిపారు. ప్రస్తుత సంక్షోభ పరిణామాల నేపథ్యంలో మిస్బా.. పీసీబీకి పూర్తిగా దూరమయ్యాడు.

# రాజన్న పనులు ఆగొద్దు..గడువులోగా పూర్తి చేయాలి..

## ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్..

బలగం టీవీ, వేములవాడ:
వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. పనులను డే అండ్ నైట్ కొనసాగిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. దేవాదాయ శాఖ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ హనుమంతరావు, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు బుధవారం రాజన్న ఆలయ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 80 అడుగుల రహదారి విస్తరణ, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ తదితర పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి పనులను ఆగమ శాస్త్రానికి అనుగుణంగా చేపట్టాలని సూచించారు. శృంగేరి పీఠాధిపతి జగద్గురు విధూశేఖర భారతి స్వామివారి సూచనలను పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అదనపు వసతులపై చర్చించినట్లు తెలిపారు.ఇప్పటికే మంజూరై టెండర్లు పూర్తయిన పనులతో పాటు తాజాగా మంజూరైన రూ.99.40 కోట్ల పనులపై సమీక్షించినట్లు తెలిపారు . టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.పనులను డే అండ్ నైట్ నిర్వహించి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి 15 రోజులకు వీడియో కాన్ఫరెన్స్, నెలకోసారి క్షేత్రస్థాయి సమీక్ష ద్వారా పనులను పర్యవేక్షిస్తామని తెలిపారు.రాజన్న ఆలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే



ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు.రాజన్న ఆలయ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టివేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని దేవాదాయ శాఖ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ హనుమంతరావు తెలిపారు.పనుల పురోగతి, నాణ్యత, మౌలిక వసతులపై అధికారులతో చర్చించారు. ప్రస్తుతం రూ.76 కోట్లతో ఆలయ అభివృద్ధి, రూ.35 కోట్లతో అన్నదాన సత్రం పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మరో రూ.99.40 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని, త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి, కళాకృతులు, నిర్మాణాలు, ఇతర మౌలిక వసతులపై చర్చించినట్లు తెలిపారు. హైదరా బాద్‌లో ఉన్నతాధికారులతో మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వీటీఏడీఏ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రతి శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అభివృద్ధిని స్వయంగా పర్యవేక్షిస్తూ అవసరమైన అనుమతుల కోసం చొరవ చూపుతున్నారని హనుమంతరావు తెలిపారు. రాజన్న ఆలయాన్ని దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గుడిచెరువు బండ్ పార్కులో సుమారు రూ.12 కోట్లతో అభివృద్ధి చేసిన ఆదిశివుడి ప్రతిమ ప్రాంతానికి రోజుకు సుమారు 2,000 మంది పర్యాటకులు వస్తున్నారని అన్నారు .

### చిత్తశుద్ధితో పనులు చేయాలి..

రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో పూర్తి చేయాలని సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు సూచించారు. ప్రతి పనిని శ్రద్ధగా.. అందరూ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రాజన్న ఆలయ వైభవం మరింత చాటేలా గొప్పగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని తెలిపారు.అందరూ కలిసి కట్టుగా పని చేయాలని ఆదేశించారు.త్వరలో మరో మీటింగ్ పెడతామని వివరించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు...ఉన్నతాధికారుల సూచనల మేరకు రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని వీటీఏడీఏ వైస్ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఆలయ పనులపై ప్రతి వారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని, దానికి అనుగుణంగా మిగతా పనులు పూర్తి చేయిస్తున్నామని అన్నారు . ప్రతి పనికి గడువు విధించి పూర్తి చేయిస్తున్నామని తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఎస్ఈ భీమ్లా నాయక్, ఆలయ ఈఈ రాజేష్, తహసీల్దార్ జయంత్ కుమార్, విద్యుత్ శాఖ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల తిప్పలు



- మూడు నిమిషాల్లోనే యూరియా స్టాక్ ఖాళీ..? రైతుల ఆగ్రహం
- బుకింగ్ పేరుతో రైతులకు ఇబ్బందులు

ఎల్లారెడ్డిపేట వీర్నపల్లి బలగం టీవీ
వానాకాలం సాగు పనులు ఊపందుకున్న సమయంలో యూరియా కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలు అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.యూరియా కోసం ముందస్తుగా మొబైల్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని సమాచారం రావడంతో రైతులు తెల్లవారుజాము నుంచే తమ మొబైల్ ఫోన్లను సిద్ధం చేసుకుని బుకింగ్ కోసం ఎదురుచూశారు. ఉదయం 9 గంటలకు బుకింగ్ ప్రారంభమవుతుందని సమా చారం ఇవ్వగా, బుకింగ్ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే స్టాక్ పూర్తయి పోయిందనిగర్జనపల్లి యువ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుకింగ్ చేసుకునేందుకు పలుమార్లు ప్రయత్నించిన ప్పటికీ యూరియా దొరకకపోవడంతో రైతుల్లో తీవ్ర అసహనం వ్యక్తమైంది. సాగు సమయంలో పంటకు అత్యవసరంగా అవస రమైన ఎరువు కోసం ఇలా గంటల తరబడి, రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి రావడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు

### "సాగు చేయాలా.. యూరియా కోసం తిరగాలా?": యువరైతు న్యాత బాబు

రైతులకు యూరియా అనేది సాధారణంగా కొనుగోలు చేసే వస్తువు కాదని, పంట ఎదుగుదలలో కీలకమైన వ్యవసాయ ఇన్‌పుట్ అని రైతులు చెబుతున్నారు. సరైన సమయంలో యూరియా అందకపోతే పంటలపై ప్రభావం పడే అవకాశం ఉందని, దీంతో చివరికి నష్టపోయేది రైతేనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బుకింగ్ విధానం ద్వారా యూరియా పంపిణీ పారదర్శకంగా, సులభంగా జరుగుతుందని అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు బుకింగ్ కావడం లేదని, స్టాక్ అందుబాటులో లేదని ఎదురుచూడాల్సి వస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు.

### గతంలో నేరుగా యూరియా రైతులకు అందేది : యువ రైతు న్యాత వినోద్

గత ప్రభుత్వ హయాంలో తమకు యూరియా నేరుగా అందేదని, ప్రస్తుతం బుకింగ్ విధానం కారణంగా అదనపు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొంతమంది రైతులు పేర్కొన్నారు. యూరియా కోసం రైతులు వరుసలో నిలబడే పరిస్థితి, మొబైల్‌లో బుకింగ్ కోసం పోరాడే పరిస్థితి రావడం వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యలకు అద్దం పడుతోందని వారు వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా రైతులు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ రైతులకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు ముందుగానే అందుబాటులో ఉంచాలని, బుకింగ్ ప్రక్రియలో సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని, చిన్న మరియు సన్నకారు రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

### యూరియా కొరతకు శాశ్వత పరిష్కారం కావాలి: రైతు పెంట మల్లేష్

ప్రభుత్వం రైతుల సమస్యలను కేవలం బుకింగ్ ప్రక్రియతో పరిష్కరించకుండా, మండలాల వారీగా రైతుల అవసరాలను అంచనా వేసి సరిపడా యూరియాను ముందుగానే కేటాయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోతే ప్రతి సాగు సీజన్‌లో ఇదే సమస్య పునరావృతమయ్యే ప్రమాదం ఉందని వారు అంటున్నారు."పంట పండించేది రైతు.. కానీ పంటకు అవసరమైన ఎరువు కోసం రైతే రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఎందుకు?" అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.మరోవైపు, యూరియా కొరతపై రైతుల్లో నెలకొన్న అసంతృప్తి రాజకీయ చర్చకు కూడా దారితీస్తోంది. గతంలో తమకు ఎదురైన పరిస్థితులతో పోల్చుకుంటూ, మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడాలని కొందరు ప్రజలు, రైతులు కోరుకుంటున్నారని స్థానికంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.రైతులకు యూరియా కొరత లేకుండా తక్ష ణమే చర్యలు తీసుకుని, బుకింగ్ విధానాన్ని సులభతరం చేసి, అవసరమైనంత ఎరువును అందుబాటులోకి తీసుకురావాలని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# తేలిపోనున్న రోహిత్ భవితవ్యం..

- ప్రపంచకప్ కోసం రోహిత్ అనుభవం జట్టుకు ఎంతో అవసరం
- కోహ్లీ ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్, అల్టిమేట్ ఫినిషర్
- దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్



భారత క్రికెట్ జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాముఖ్యతను దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్ నొక్కిచెప్పాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేస్తున్న తరుణంలో రోహిత్ శర్మ అపారమైన అనుభవం టీమిండియాకు ఒక భారీ ఆస్తి అని అభిప్రాయపడ్డాడు. అదే సమయంలో విరాట్ కోహ్లీలోని గెలుపు తపన, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చి ప్రశంసలు కురిపించాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ జాంటీ రోడ్స్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "2027 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రణాళికలు రచిస్తున్నప్పుడు, రోహిత్ శర్మ లాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు జట్టులో ఉండటం అమూల్యమైనది. మనం తరచుగా ఆటగాళ్ల ప్రతిభ, వారి ప్రదర్శనల గురించే చర్చిస్తాం. కానీ, ప్రపంచకప్ లాంటి అత్యంత ఒత్తిడితో కూడిన టోర్నీల్లో మానసిక బలం అనేది చాలా కీలకం. ఈ విషయాన్ని సెలక్షన్‌లో అంతగా పట్టించుకోం" అని రోడ్స్ పేర్కొన్నాడు. తాను నాలుగు ప్రపంచకప్‌లు ఆడినా రెండు సెమీఫైనల్స్ దాటలేకపోయానని, ఆ టోర్నీల్లో ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో తనకు బాగా తెలుసని గుర్తుచేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో రోహిత్ లాంటి ఆటగాడి అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని వివరించాడు. ఇప్పటివరకు 288 వన్డేల్లో 34 సెంచరీలు, 62 అర్ధ సెంచరీలతో దాదాపు 12 వేల పరుగులు చేసిన రోహిత్, 2019 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రోహిత్ గురించి మాట్లాడుతూనే, జాంటీ రోడ్స్ విరాట్ కోహ్లీపై కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లీలోని గెలుపు కసిని, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చాడు. "ఒకప్పుడు ప్రపంచకప్‌లను ఆస్ట్రేలియా ఎలా శాసించిందో మనం చూశాం. గెలవాలనే వారి తపన, దూకుడు అమోఘం. సరిగ్గా అలాంటి గెలుపు ఆకలి విరాట్ కోహ్లీలో కనిపిస్తుంది. జట్టును గెలిపించాలనే సంకల్పం అతనిలో బలంగా ఉంటుంది" అని రోడ్స్ అన్నాడు. ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్‌గా, టీమిండియాకు అల్టిమేట్ ఫినిషర్‌గా కోహ్లీ నిలిచాడని కొనియాడాడు. "ఛేజింగ్‌లో కోహ్లీ స్థిరంగా రాణించడం, జట్టును విజయతీరాలకు చేర్చాలనే అతని పట్టుదలను తెలియజేస్తుంది. అతను పోటీని, పోరాటాన్ని ఇష్టపడతాడు. కెప్టెన్‌గా ఉన్నా లేకపోయినా, భారత్ గెలవాలనే అతని డ్రైవ్ మాత్రం మారదు" అని జాంటీ రోడ్స్ స్పష్టం చేశాడు. 314 వన్డేల్లో 54 సెంచరీలతో దాదాపు 15 వేల పరుగులు చేసిన కోహ్లీ గణాంకాలే అతని సత్తాను తెలియజేస్తాయని అన్నాడు.

# బీసీసీఐ కీలక సమావేశం

భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) అత్యున్నత స్థాయి సమావేశానికి సిద్ధమైంది. గురువారం ముంబైలోని బీసీసీఐ హెడ్ క్వార్టర్స్‌లో ఈ మీటింగ్ నిర్వహించనుంది. ఈ సమావేశానికి సంబంధించిన ఎజెండాను అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ.. ఐర్లాండ్, ఇంగ్లండ్, శ్రీలంక పర్యటనల్లో భారత జట్టు ప్రదర్శనపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, బీసీసీఐ సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ హాజరుకానున్నారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వర్చువల్‌గా పాల్గొననున్నాడు. సీసీ టీ20 ప్రపంచ కప్ విజయానంతరం.. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ జట్టు దారుణంగా విఫలమైంది. వరుసగా 6 టీ20 మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించలేకపోయింది. ఈ ఫలితాలపై బీసీసీఐ అప్పట్లోనే ఆందోళన వ్యక్తం చేసింది.ఈ వైఫల్యాలపై ఖచ్చితంగా సమీక్ష చేస్తామని సెక్రటరీ దేవజిత్ సైకియా అప్పట్లోనే మీడియాకు తెలిపారు. కానీ అనివార్య కారణాల వల్ల ఈ సమావేశం ఇప్పటి వరకు జరగలేదు.భారత జట్టు ప్రదర్శనతో పాటు భవిష్యత్తు ప్రణాళికలపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ భవితవ్యంపై బీసీసీఐ, సెలెక్షన్ కమిటీల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. వన్డే ప్రపంచకప్ 2027 వనకు రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం కష్టమని వార్తలు వచ్చాయి. రోహిత్ రిటైర్మెంట్ అంటూ కూడా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ వార్తలను బీసీసీఐ ఖండించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే రోహిత్ శర్మ భవితవ్యంపై కూడా ఈ సమావేశంలో చర్చించినున్నట్లు తెలుస్తోంది. జట్టులో కొనసాగించాలా? వద్దా? అనేదానిపై బీసీసీఐ, మేనేజ్‌మెంట్ ఏకాభిప్రాయానికి రానుంది. ఈ సమావేశం అనంతరం రోహిత్ భవితవ్యంపై స్పష్టత రానుంది.అప్‌కమింగ్ న్యూజిలాండ్ పర్యటనలో అనుసరించాల్సి వ్యూహాలపై కూడా చర్చ జరగనుంది. అంతేకాకుండా జట్టు వేధిస్తున్న ఆటగాళ్ల గాయాల బెడద గురించి సుదీర్ఘంగా చర్చింనున్నారు. ముఖ్యంగా సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌ను వివరణ కోరనున్నారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడగింపుతో



పాటు, భారత జట్టు నిర్వహణలో వీవీఎస్ లక్ష్మణ్‌కు మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించే అంశంపై కూడా చర్చలు జరగవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సెప్టెంబర్ 18న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) కంటే ముందే ఈ ఉన్నత స్థాయి భేటీ జరుగుతుండటంతో.. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు భారత క్రికెట్ భవిష్యత్తును నిర్దేశిస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మూడు సినిమాలతో మమిత బైజు హ్యాట్రిక్



'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు .. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది. ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్' విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది. సూర్య కథానాయకుడిగా విశ్వనాథ్ అండ్ సన్స్..: భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది. బె÷-లతెహోమ్ కుటుంబ యూనిట్..: నివిన్ పౌలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది. ఇప్పటికే రూ.200 కోట్ల మార్క్ దాటి రూ.250 కోట్ల దిశగా దూసుకుపోతోంది. దీన్నే తెలుగులో సెప్టెంబరు 4న విడుదల చేయనున్నారు.



CINEMA

# టాక్సిక్‌కు హాఫ్ స్టార్ రేటింగ్




## లెటర్ బాక్స్‌లో మహేశ్ బాబు తనయుడు గౌతమ్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కుమారుడు గౌతమ్ ప్రముఖ సోషల్ మీడియా రేటింగ్ యాప్ లెటర్‌బాక్స్ ద్వారా ఇచ్చిన సినిమా రేటింగ్‌లు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. యశ్ హీరోగా నటించిన 'టాక్సిక్' సినిమాకు గౌతమ్ కేవలం హాఫ్ స్టార్ (0.5) ఇవ్వడం, అలాగే తన తండ్రి మహేష్ బాబు సినిమాలకే కాకుండా ఇతర స్టార్ హీరోల చిత్రాలకు ఇచ్చిన రేటింగ్‌లు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గౌతమ్ లెటర్‌బాక్స్ ప్రొఫైల్ ప్రకారం.. అతను ఇప్పటివరకు వివిధ భాషలు మరియు జోనర్లకు చెందిన 400లకు పైగా సినిమాలను వీక్షించినట్లు తెలుస్తోంది. అయితే ఇతరులతో సంబంధం లేకుండా, సినిమాల కంటెంట్‌ను బట్టి స్వతంత్రంగా రేటింగ్‌లు ఇవ్వడం ఈ డిబేట్‌కు ప్రధాన కారణమైంది. తన తండ్రి మహేష్ బాబు నటించిన కల్ట్ క్లాసిక్స్ 'పోకిరి' మరియు '1: నేనొక్కడినే' సినిమాలకు గౌతమ్ 5 నక్షత్రాల రేటింగ్ ఇవ్వగా, 'బ్రహ్మోత్సవం' చిత్రానికి కేవలం 1 స్టార్ మాత్రమే ఇచ్చాడు. అలాగే 'నిజం', 'వంశీ' చిత్రాలకు 2 చొప్పున రేటింగ్ ఇచ్చాడు. కేవలం టాలీవుడ్ మాత్రమే కాకుండా పాన్-ఇండియా మరియు హాలీవుడ్ సినిమాలపై కూడా గౌతమ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. 'బాహుబలి 2' చిత్రానికి 5 స్టార్లు ఇవ్వగా, 'పెళ్లిచూపులు', 'సీతారామం' సినిమాలకు 4.5 రేటింగ్ ఇచ్చాడు. మరోవైపు, యశ్ 'టాక్సిక్' చిత్రంతో పాటు విజయ్ దేవరకొండ 'లైగర్' మూవీకి కూడా అర నక్షత్రం రేటింగ్ ఇవ్వడం విశేషం. ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి 2.5 రేటింగ్ ఇచ్చాడు. ఇక సినిమా కుటుంబానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, బంధుప్రీతికి తావు ఇవ్వకుండా సినిమాలోని కంటెంట్ ఆధారంగా నిజాయితీగా రేటింగ్‌లు ఇస్తున్నాడని కొందరు నెటిజన్లు గౌతమ్‌ను ప్రశంసిస్తుంటే, మరి కొందరు సెలబ్రిటీ కుటుంబాల నుంచి ఇలాంటి బహిరంగ రేటింగ్‌లు రావడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సెలబ్రిటీల పిల్లలు అయినంత మాత్రాన వారి వ్యక్తిగత అభిప్రాయాలు, సినిమా రుచి ఇతరులలాగే ఉండటంలో తప్పులేదని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# నవంబర్ 27న మైసా విడుదల




## రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మునుపెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మునుపెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి. రష్మిక కథానాయిక. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసింది.



## కరీనా కపూర్ క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'




బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ మరియు టాలెంటెడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూని కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా ప్రత్యర్థి పోలీసు అధికారులుగా కనిపించను న్నారు. చట్టం వర్సెస్ న్యాయం, నకిలీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయిన రామన్ కుమార్‌పై మరో పోలీసు అధికారి అజూని కోహ్లీ దర్యాప్తు చేసే తీవ్రమైన సన్నివేశాలతో ట్రైలర్ ఎంతో ఆసక్తికరంగా సాగింది. జంగ్లీ పిక్చర్స్ మరియు పెన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మేఘనా గుల్జార్ యదార్థ ఘటనల ఆధారిత సీరియస్ డ్రామాగా మలిచా రు. సస్పెన్స్ మరియు హై-వోల్టేజ్ డ్రామాతో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ 18న విడుదల కానుండగా, ప్రస్తుతం ఈ ట్రైలర్ సినీ వర్గాల్లో భారీ అంచనాలను పెంచేసింది.




# మారెమ్మ ట్రైలర్ విడుదల




మాస్ మహారాజ రవితేజ సోదరుడి తనయుడు మాధవ్ భూపతిరాజు ప్రధాన పాత్రలో తెరకెక్కిన విలేజ్ యాక్షన్ డ్రామా 'మారెమ్మ' ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిన టీజర్‌తో సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. ఇప్పుడు ట్రైలర్ ద్వారా కథకు సంబంధించిన మరిన్ని ఆసక్తికర అంశాలను ప్రేక్షకులకు పరిచయం చేసింది. గ్రామీణ నేపథ్యం, దైవ విశ్వాసాలు, మూఢనమ్మకాలు, యాక్షన్ అంశాలను మేళవిస్తూ ఈ సినిమాను తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. కథ విషయానికి వస్తే.. ఓ సంక్షోభంలో చిక్కుకున్న గ్రామస్తులు తమ గ్రామ దేవత మరెమ్మ తల్లిపై నమ్మకం పెట్టుకుంటారు. అయితే అమ్మవారికి సంబంధించిన పవిత్రమైన ఎద్దు అనూహ్యంగా కనిపించకుండా పోవడంతో గ్రామంలో ఒక్కసారిగా భయాందోళనలు మొదలవుతాయి. ఆ ఎద్దు అదృశ్యం కావడం వెనుక ఏదో పెద్ద కారణం ఉందని గ్రామస్తులు భావిస్తారు. ఈ పరిణామాల నేపథ్యంలో యువ కథానాయకుడిపై ఆ ఎద్దును వెతికి తీసుకురావాల్సిన బాధ్యత పడుతుంది. ఎద్దు కోసం అతడు చేసే అన్వేషణ క్రమంలో ఎన్నో ఊహించని పరిణామాలు ఎదురవుతాయి. గ్రామంలో పాతుకుపోయిన నమ్మకాలు, స్థానిక రాజకీయాలు, ఆధిపత్య పోరాటాలు అతడి ప్రయాణాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తాయి. ఈ క్రమంలో హీరో పలు హింసాత్మక సంఘర్షణల్లో చిక్కుకున్నట్లు ట్రైలర్‌లో చూపించారు. అయితే 'మారెమ్మ' కథలో అసలు మిస్టరీ ఏమిటన్నది మాత్రం ట్రైలర్‌లో పూర్తిగా రివీల్ చేయలేదు. పవిత్రమైన ఎద్దు ఎందుకు కనిపించకుండా పోయింది? దాని వెనుక ఎవరి హస్తం ఉంది? హీరో ఎదుర్కొనే సమస్యలకు, గ్రామ దేవత నమ్మకాలకు ఉన్న సంబంధం ఏమిటి? అనే ప్రశ్నలను అలాగే ఉంచుతూ ట్రైలర్‌ను ఆసక్తికరంగా కట్ చేశారు. ముఖ్యంగా గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. ఉత్కంఠభరితమైన సన్నివేశాలకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత బలాన్ని చేకూర్చింది. సాధారణ విలేజ్ డ్రామాకు భిన్నంగా దైవ విశ్వాసం, గ్రామీణ ఆచారాలు, మిస్టరీ, యాక్షన్ అంశాలను కలిపి కథను నడిపించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో దీపా బాలు కథానాయికగా నటించగా.. వికాస్ వశిష్ట, వినోద్ కుమార్, వీఎస్ రూపలక్ష్మి, దయానంద్ రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి మంచాల నాగరాజు దర్శకత్వం వహిస్తున్నారు. ట్రైలర్‌తో సినిమాపై మరింత ఆసక్తిని పెంచిన 'మారెమ్మ' సెప్టెంబర్ 10న థియేటర్లలోకి రానుంది. గ్రామీణ నేపథ్యంలోని మిస్టరీ, యాక్షన్ కథలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈసినిమాఎలాంటి అనుభూతిని అందిస్తుందో చూడాలి.



